


# అవధులు

"అమ్మా... అమ్మా... బాబు వెళ్ళిపోతున్నాడే..." అంటూ సరళ వాకిటిగదిలో నుంచి అరిచేటప్పటికి శాంతమ్మ పరుగు పరుగున వీధిలోకి వచ్చింది. మధు చేతిసంచితో వీధిలోకి చరచర సాగిపోయాడు. ఉద్రేకంలో "మధూ..." అంటూ పిలవబోయిన శాంతమ్మ తను రోడ్డుమీదకు రావటం గమనించి, సిగ్గుపడి ఇంట్లోకి వచ్చేసింది. అవధాని తొణకని కుండలా భగవద్గీత శ్లోకాలను పఠిస్తున్నాడు. శాంతమ్మ కాళ్ళు తేలిపోతున్నాయి. గుండె దడగా ఉంది. అవధాని వైఖరి చూసిన ఆమె వికృతరూపం ధరించి "మధు వెళ్ళిపోతున్నాడండీ... అలా కూర్చుంటారేమిటండీ... అయ్యో... పిలుచుకు రండీ" అంటూ పురమాయించింది. అవధాని 'గీత' మూసివేసి ఒకసారి శాంతమ్మవైపు తీక్షణంగా చూచాడు. శాంతమ్మ ఇంకొంచెం గొంతు పెద్దది చేసి "గుడ్డి కొంగను చూసినట్లు అట్లా చూస్తారేమిటండీ... మధు వెళ్ళిపోతున్నాడు... నేను చెప్పేది మీ బుర్రకేమైనా ఎక్కుతోందా?" అంటూ గర్జించింది.

"అయిందా ఉపన్యాసం... అంత ఆపేక్ష పడిపోతుంటే పోయి పిలుచుకు రాలేకపోయినావూ..?" అన్నాడు అవధాని లేచి మంచుని.

"నన్ను వీధిన పడమంటారా... అంతకంటె పరువుగల మాట మీకు ఇంకేదీ తోచలా..."

"పరువు మర్యాదలుంటాయని నీకు గూడా తెలుసు గదా... అంత అభిమానం చచ్చినవాడిని అనుకున్నావా... నాలో ఇంకా నెత్తురు చావలేదు... ఇకముందెప్పుడూ వాడు మనింట్లో పచ్చి

మంచినీళ్ళయినా ముట్టుకోవటానికి వీల్లేదు... జన్మలో వాడి ముఖం చూడను... ఇంకేమన్నా అడిగేవి ఉంటే ఇప్పుడే చెప్పు... నేను మళ్ళీ గీతాపారాయణ చేసుకోవాలి..." అన్నాడు అవధాని విసురుగా నేలమీది 'గీత' పుస్తకం తీసుకుంటూ. శాంతమ్మ నిశ్చేష్టురాలైంది. ఆమెకు సమాధానమూ దొరకలేదు... ప్రశ్నలూ చిక్కలేదు... అవధాని చివాలున దొడ్లోకి వెళ్ళిపోతూ "ఇక ముందెప్పుడూ వాడి సంగతి నా ముందర ఎత్తకు. ఈ పూటతో ఆ ఋణం కూడా తీరిపోయింది" అన్నాడు. సరళకు ఆ ఉన్మత్త వాతావరణం చూచేటప్పటికి భయం వేసింది. తల్లిని కావలించుకుని వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది. శాంతమ్మ సరళను చంకనువేసుకు చేతులు తమాషాగా ఆడిస్తూ "ఇంకెప్పుడూ మధు ముఖం చూడరూ? అదెల్లా సాగుతుందో నేను చూస్తాగా" అని అక్కడే కూలబడింది.

సముద్రానికి చెలియలికట్ట దగ్గరనుంచీ, ఇంటికి గోడదాకా హద్దులనేవి సహజంగానూ, కృత్రిమంగానూ ఉన్నా వాటి ఆవశ్యకతను సృష్టికర్తా విస్మరించలేదు. అతని సృష్టి వదిలిపెట్టలేదు అందుకనే సముద్రుడు చెలియలికట్ట దాటటమే జరిగితే ప్రళయమే సంభవిస్తుంది అవధానికి ఈ సంగతి తెలియకగాదు మధు వెళ్ళిపోతున్నా నిశ్చలంగా ఉండిపోయింది. మధుకూ తెలియకగాదు పాతుకుని పోయిన వేళ్ళను పెళ్ళగించటానికి ప్రయత్నించింది.

వీరిద్దరూ ఒక తల్లిబిడ్డలే. మధు కడుపున పడటంతోనే, ఈ లోకంలోని సుఖదుఃఖాలను శాశ్వతంగా విడిచిపెట్టి పోయిన భర్తను వెదుక్కుంటూ, మధు తల్లి అతన్ని ఈ లోకంలో అన్నగారి చేతికింద పెరగమని శాసించి, స్వర్గంలో భర్తను కలుసుకుంది. మధు పాలకోసం ఏడిస్తే తను ఎత్తుకు తిరిగేవాడు. శాంతమ్మ లోపలకు తీసుకుపోయి పాలు పట్టేది. జోల పాడేది. ఆ రోజులవి.

అవధాని అవన్నీ మరిచిపోలేదు. విస్మరించగలిగాడు. మధుది మొదటినుంచి దుడుకు స్వభావమే. దాన్ని చూడవలసిన బాధ్యతను తల్లిదండ్రులయితే తప్పించుకోగలిగారుగాని అవధానికి తప్పలేదు. అతనికి అప్పటికే వివాహమయి శాంతమ్మ కాపరానికి గూడా వచ్చింది. కొత్తగా కాపరానికి వచ్చిన శాంతమ్మకు పసిపాప దొరకటం ఎంతో బాధ్యతగానే గుర్తించింది. కారణాలు దురదృష్టకరమైనవి అయినా శాంతమ్మకు అందులో ఒక ఆనందం, తృప్తి. అవధానిగూడా తమ్ముడిని పెంచి పెద్దవాడిని చేస్తున్నాడని ఎప్పుడూ అనుకోలేదు. తన బిడ్డను పెంచుతున్నామనే అనుకున్నాడు.

భగవంతుడు అది గ్రహించే అయి ఉండాలి, ఈ దంపతులకు పిల్లలు లేకుండా చేశాడు. అదంతా మధుమీద ప్రేమకే అనిపిస్తుంది. పురిటి పిల్లవాడు బ్రతికి బట్టగడతాడని ఎవ్వరూ అనుకోలేదు. చూడటానికి వచ్చినవాళ్ళు అంతా కళ్ళు వత్తుకుని వెళ్ళిపోయారు. అవధాని చాలామందితో గద్గదస్వరంతో అన్నాడు "తల్లిదండ్రులను గురించి ఏమయినా చెప్పండి... ఈ పాపకేం భయం లేదు..." అని. కొంతమంది శాంతమ్మను ఓదార్చి "అంత పాపను సాకటం ఎంత దురదృష్టం అమ్మా" అని సానుభూతి కనపరిస్తే "పాప గురించి విచారపడకండి. పాప ప్రాణం నా ప్రాణం మీద పూచి... ఏం భయం లేదు..." అని పాపను నవ్వించాలని ప్రయత్నం చేయబోయి గ్రుడ్లనీరు కుక్కుకునేది.

పాపకు పేరు 'మధు' అని పెట్టినప్పుడు శాంతమ్మ హృదయంలో ఎన్ని మధువులూరినాయో ఆ భగవంతునికే తెలియాలి. అవధానికే తెలియాలి. అందరూ వెళ్ళిపోయిన తరవాత అవధానికి గూడా తెలియకుండా దిష్టి తీసింది. అవధాని చూడనయితే లేదుగాని అటువంటి పనిచేసిందంటే

ఆశ్చర్యపడే విషయం మటుకు కాదు అతనిది.

శాంతమ్మను 'వదినా' అని పిలవటం తెలియదు మధుకు. 'పిన్నమ్మా' అని పిలుస్తాడు. అవధానిని పిలవటమే తెలియదు. సంబోధన ఏమీ లేకుండా ముభావంగా కావలసింది అడిగిపోతుండేవాడు. మధు వెళ్ళిపోయిన తర్వాత "చూడు శాంతా... ఇంత వినయం ఎవరయినా తల్లిదండ్రుల దగ్గరయినా చూపిస్తారూ... వీడు తమ్ముడంటే నాకు నమ్మకం కలగటం లేదు... నీ కడుపున పడవలసినవాడు..." అనేవాడు. శాంతమ్మ హృదయం పులకరం పొందేది. అప్పుడు అనిపించేది ఆమెకు 'తన కడుపున గూడా ఒక కాయ కాస్తే...' అని. ఆమె ఆలోచన దూరం పోలేకపోయింది. "మధు నా బిడ్డే... వాడి పుట్టుక వివరాలను గురించి మళ్ళీ మళ్ళీ చర్చించకండి... నాకు భయం వేస్తుంది" అన్నది.

అవన్నీ అవధానికీ గుర్తున్నాయి. శాంతమ్మ అవధాని తిరిగి వస్తాడేమోనని చూచింది. ఎంతసేపటికీ రాలేదు. సరళ కాళ్ళకు చుట్టుకుని "అమ్మా... బాబు ఎప్పుడు వస్తాడే..." అంటూ ఏడుస్తోంది. సరళకు కొద్దిగా అర్థమయింది. బాబు కోపం వచ్చి వెళ్ళిపోయాడనీ, ఎవ్వరు వెళ్ళవద్దని చెప్పలేదనీ. అంతకంటే ఎక్కువగా తెలియదు.

ఆ రోజుతో పదిరోజులవుతుంది మధు ఇంటికి వచ్చి. శాంతమ్మ చీపిరికట్టతో దిగతుడిచి నేలమీద మూడుసార్లు కొట్టింది. మధు నవ్వుతూ ఇంటిలోకి వచ్చినప్పుడు శాంతమ్మ ఎంతగా ఉప్పొంగిపోయిందో అవధానికి గూడా తెలుసు. సరళ ఎకాయెకి అతని భుజాలమీదకే ఎక్కి కూర్చుంది.

శాంతమ్మ కూర్చుంటే ఏవేమిటో గుర్తుకు వస్తున్నాయి. ఆమె మనస్సును కలవరపెట్టుతున్నాయి. ఒక్కొక్కసారి అంతా తప్పు మధులో లేదనిపిస్తుంది. అవధాని మూర్ఖంగా ప్రవర్తించకపోతే మధు హృదయం విరిగిపోయేది గాదు. ఇల్లు విడిచి వెళ్ళిపోయేవాడు గాదు. ఇంట్లో ఉన్న ఇబ్బందులివ్వాళ ఒక్కసారిగా ఉవ్వెత్తున పెరిగిపోయిందేమీ లేదు. అయినప్పటికీ అవధాని మధుతో మాట్లాడే విధంగా మెల్లిగా చెప్పివుంటే గ్రహించుకునేవాడు. మొండిగా కటువుగా చెపుతుంటే ఎవరికయినా కష్టమే అనిపిస్తుంది. అందులో మొదటినుంచి దుడుకువాడైన మధు సంగతి చెప్పనే అక్కర్లేదు.

చిన్నప్పటినుంచీ తాము రెండుపూటలా తిన్నా తినకపోయినా కూరలతోనూ, పప్పులతోనూ మధును పెంచారు. అవధాని తాలూకా ఆఫీసు గుమాస్తాగిరిలో సంపాదించే బహుకొద్ది మొత్తం కాకుండా రాత్రిపూట పిల్లలకు పాఠాలు చెప్పి, సెలవురోజుల్లో ట్రైపుమిషన్ దగ్గర కూర్చుని దమ్మిడీలు కూడబెట్టి రూపాయలు తయారుచేశాడు. అదంతా అతను చెమటోడ్చి మిగిల్చిన సొమ్ము. అవధాని చొక్కాకు గుండీలయినా ఎప్పుడూ కొనుక్కొని ఎరగడు. దారాలతో కట్టుకునేవాడు. కాళ్ళకు చెప్పులు వేసుకునే అలవాటే లేదు. మాసికల పోగులయిన కోటు ఒకటి గుమాస్తా గిరి సార్థక చిహ్నామయినట్టు ఆఫీసుకు పోయేటప్పుడు వేసుకుని వెళ్ళిపోతుండేవాడు. శాంతమ్మ ఆ అవతారంలో ఉన్న అవధానిని చూచి గుడ్లలో నీరు కుక్కుకున్నది.

మధుకు మొదటి తరగతినుంచి అన్నిటిలోనూ పెద్ద పెద్ద మార్కులు వస్తూ ఉండేవి. ప్రతి పరీక్షలో ఏ రెండు మూడు సబ్జెక్టుల్లోనన్నా తప్పనిసరిగా ఫస్టుమార్కులు వస్తుండేవి. అవధాని శాంతమ్మతో ఆ మార్కుల వివరాలన్నీ పూస గుచ్చినట్లు చెప్పి మురిసిపోయేవాడు.

మధు స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు. అంతవరకు వూళ్ళోనే హైస్కూలు ఉండటంతో

సరిపోయింది. ఇంట్లో భోజనం. స్కూలుకు పుస్తకాలూ, నెలసరి జీతాలూ తప్పితే అతనికి పెద్ద ఖర్చేమీ అయేది గాదు. ఎప్పుడయినా చిరుతిండికి కావాలంటే ఒక కానీ, అర్ధణా ఇస్తుండేవాడు. మధ్యాహ్నం పూట ఐస్‌ఫ్రూట్, లేకపోతే జీడీలు కొనుక్కుని సరిపుచ్చుకుంటూ వుండేవాడు. ఇప్పుడు వూరు విడిచి కాలేజీకి పోవాలంటే అన్నీ ఇబ్బందులే. ఉండటానికి గది దగ్గరనుంచి, భోజనం, పెద్ద పెద్ద జీతాలు కావాలి. అవధాని మధు చదువు చూసి ఎంతో మోజు పడేవాడు కాలేజీ చదువు చెప్పించటం అంటే సామాన్యమైన విషయం కాదు. అతని తాహతుకు మించినపని.

ఏమి చెయ్యాలా అని దిగాలుపడి ఆ రోజు ఆఫీసుగదిలో కూర్చుంటే తోటి గుమాస్తాలంతా అతనికి ధైర్యం చెప్పారు.

"నీ పని ఎలా అయిందో చూడు అవధాని.. . నీ తండ్రిపేదరికం వలననేగా నీకీ దుర్దశ ప్రాప్తించింది... నీ దురదృష్టాన్ని నీతోనే అంతమొందించు... నువ్వు ప్రాణత్యాగం చేసయినా సరే మధుకు ఒక దశ కల్పించు... అతన్ని నీ గాడిలోకి లాగక .." ఇది చాలామంది చెప్పిన సలహాల సారాంశం. అతనికీ బాగానే తోచింది. తననూ చదివిస్తే ఏ గ్రాడ్యుయేటో అయి రెండువందల రూపాయలు సంపాదించుకోగల తాహతు తెచ్చుకునేవాడు. మధు జీవితం గూడా తను నాశనం చేయలేదు. తనకా పిల్లలు లేరు. కలిగే ఆస్కారం గూడా కనిపించటం లేదు. అతనికి కర్తవ్యం సుస్పష్టంగా కళ్ళముందు కనబడింది.

మధు కాలేజీలో ప్రవేశించాడు.

శాంతమ్మ కోసం వాయిదాల పద్ధతిమీద ఒక కుట్టుమిషన్ కొన్నాడు. అవధాని శాంతమ్మకు సంగతి సందర్భాలు వివరంగా చెప్పి నచ్చేటట్లు చెయ్యటానికి ప్రయత్నించాడు. శాంతమ్మకు అంతకుముందే తను చెయ్యబోయే పనిలో సంపూర్ణమైన విశ్వాసం, ఉత్సాహం కలిగినాయి. మర్యాదకోసం అవధాని వివరించినప్పుడు తలవూపి, 'అలాగే' అంది.

కాలేజీలో మధుకు స్కాలర్‌షిప్ దొరికింది. అవధాని శాంతమ్మలు రెట్టించిన ఉత్సాహంతో పగలనక, రాత్రనక శ్రమించి రూపాయలు నిలవ చేస్తున్నారు. మధు అడగటమే ఆలస్యం వెంటనే మనియార్డర్ వెళ్ళేది. మధుకు అదిగూడా కొంత సంతృప్తిని ఇచ్చేది. ఇంకా వుత్సాహంతో పరీక్షలకు చదువుతూ వచ్చాడు.

మధు ఇంటర్ పరీక్షలో యూనివర్శిటీ మొత్తానికి మూడవవాడుగా ప్యాసయ్యాడు. శాంతమ్మ ఇరుగుపొరుగులను పిలిచి కాఫీ ఇచ్చి తన మధుకు మార్కులు ఎలా వచ్చిందీ వివరంగా అందరితోటీ చెప్పి తను ఎంతో ఆనందించేది.

మధు ఇంటర్ అయిన తర్వాత ఇంజనీరింగ్ పరీక్షకు వెళ్ళాడు. అవధాని, శాంతమ్మలు కలిసి కూడబెట్టిన మూలధనం మెల్లిమెల్లిగా కరిగి చివరకు అంతా ఖర్చయిపోయింది. అవధానికి చింకి కోటూ, శాంతమ్మకు కుట్టుమిషనూ మిగిలాయి.

ఇంత కష్టపడ్డామన్నమాట ఆ ఇంటిలో ఎవరూ అనుకోరు. 'ఎవరికోసం కష్టపడటం... అయినవాళ్ళ కోసం కష్టపడటం గొప్పా' అని అనుకునేవాళ్ళు శాంతమ్మ, అవధానులు. మధుకి మధ్య మధ్య కొద్దిగా బాధ కలిగించినా అప్పుడప్పుడు నిర్లక్ష్యభావం కనిపించేది. "ఎవరికోసం చేస్తారురా వాళ్ళు... తరవాత నీనుంచి నాలుగింతలు గుంజుకుందామని ఆశ... అంత ప్రేమ చూపించటానికి, వాళ్ళు నీ అమ్మా, నాన్నా ఏం కాదుగా..." అంటూ తమాషాగా అన్న స్నేహితుల మాటలు అతనికి నిజంగా తోచేవి.కారణాలేమయినా మధుకు వాళ్ళమీద మామూలు గౌరవం ఏర్పడిపోయి, ప్రేమభావం తొలగిపోతూ వచ్చింది.

ఒకసారి జీతం పంపటం ఆలస్యం అయితే మధు మండిపడుతూ ఉత్తరం వ్రాశాడు. జీతం పంపించకుండా ఉంటే చదువు పాడైపోతుందనీ, ఇంకొక్క సంవత్సరం ఇలాగే ఇబ్బందిపడితే తరువాత తన బాధ ఏమీ ఉండబోదనీ. అవధాని ఆ వుత్తరం అంతా శాంతమ్మకు చదివి వినిపించి, "చూశావా... మధు తెలివితేటలు... తరువాత తన ఇబ్బంది ఉండదుట... మనల్ని వదిలిపెట్టిపోతాడా ఏం..." అని.

"పసివాడి మాటలకు అన్ని అర్థాలు తీస్తారేమిటండీ..." అంటూ విసుక్కుంది శాంతమ్మ. "నీముందు ఇంకా పసివాడే... నా ముందు పెద్దవాడులాగా కనబడుతున్నాడు" అన్నాడు అవధాని. వాళ్ళిద్దరిదీ ఒకటే అభిప్రాయం. చిన్నవాడు ఏదో తెలియక వ్రాశాడని మరునాడు డబ్బు మనియార్డర్ ద్వారా వెళ్ళింది.

పరీక్షకు జీతాలు కట్టవలసిందని ముందుగా తెలియటంతో కుట్టుపని ఎక్కువవుతుంది శాంతమ్మకు. అవధాని కల్పించుకుని పాఠాలు కుదుర్చుకొని చెబుతాడు. సెలవురోజుల్లో టైపు మిషను ముందర పని ఎక్కువ చేస్తాడు. నాలుగు డబ్బులు మిగులుతే ఎటువంటి పరిస్థితుల్లోను ముట్టుకోగూడదని ప్రతిజ్ఞ చేసుకుంటారు. భగవంతుడు వీరికి అనుకూలంగా ఎప్పుడూ ఆ డబ్బుతో వచ్చే అవాంతర పరిస్థితులేవీ కల్పించలేదు.

ఇప్పుడతనికి పరీక్షలు ఆఖరుసారిగా వస్తున్నాయి. పరీక్ష ఫీజు ఎక్కువ కట్టాలి. స్కాలర్‌షిప్ ఇస్తారుగాని పరీక్ష ఫీజు పూర్తిగా మినహాయించరు. అవధాని దగ్గర పైకమంతా..... అయిపోయింది. శాంతమ్మ కుటుంబం ఖర్చు కింద నెలకు పాతిక రూపాయలు గూడా కావు. సొంత పాక. ఇంటి పని అంతా ఆమె చూచుకుంటుంది. బయటి పనంతా అవధాని చూచుకుంటాడు. బొటాబొటి భోజనం ఖర్చువరకే వాళ్ళ కుటుంబంమీద అవుతోంది.

మధు దగ్గరనుంచి జీతం కట్టటానికి డబ్బు కావాలనీ, అదే ఆఖరుసారిగా కట్టటమనీ వ్రాశాడు. అవధాని చేతిలో దమ్మిడీ లేదు. పదిహేను రోజులకంటే వ్యవధి ఎక్కువ లేదు. అతనికి ఏం చెయ్యటానికీ తోచలేదు. ఎక్కడయినా అప్పు దొరికితే తెద్దామని బయలుదేరాడు. దమ్మిడీ విలువచెయ్యని మనుష్యులకు ఎవరు ఏ హామీమీద డబ్బు అప్పుగా ఇవ్వటానికి సిద్ధపడతారు గనుక. అవధాని వట్టి చేతులు తిరిగివచ్చినాయి. అతనికి ఏమి చెయ్యాలో అంతుపట్టలేదు.

శాంతమ్మతో ఆ విషయం కదిలిస్తే "దీనితో ఇక్కట్లు తొలిగిపోతాయి... మన పాక తాకట్టు పెట్టి అయినాసరే వాడికి కావలసింది పంపించండి... ఇంటి అద్దెకు ఇవ్వాలిట... భోజనానికి ఇవ్వాలిట... పరీక్ష ఫీజు... సిరాలకని, కాగితాలకని ఎంత ఇబ్బంది పడుతున్నాడో ఏమిటో..." అంది శాంతమ్మ. శాంతమ్మ మాటల ధైర్యం చూచుకుని ఇల్లు తాకట్టు పెట్టేశాడు అవధాని. డబ్బు కొద్దిగా వచ్చింది. ఎక్కువగా తీసుకుంటే తీర్చటానికి ఇబ్బంది.

ఆ రోజు ఎండ నిప్పులుచెరుగుతోంది. ఆ చెవులో నుంచి గాలి ఈ చెవులోకి వస్తోంది. అవధాని డబ్బు పంపించటానికి నెత్తిన గొడుగు లేకుండా, కాళ్ళకు చెప్పులు లేకుండా బయలుదేరాడు. ఒళ్లంతా వేడి ఆవిరులు తేలుతున్నాయి. అలాగే నిభాయించుకుని పోతున్నాడు. ఎక్కడైనా చెట్టుకింద నీడ దొరుకుతుందేమోనని అడుగులు వడివడిగా వేస్తూ పోతున్నాడు. పోస్టాఫీసు దగ్గరకు పోయేటప్పటికి అతనికి దడ వచ్చింది. కళ్ళు తిరిగి గిర్రున కింద పడిపోయాడు. అంత ఎండతో కాలిపోయిన నేల వేడి అతనికి తెలియలేదు. నేలవేడి అతనికి సోకినట్లే లేదు. దూరాన్నుంచి ఎవరో పరుగెత్తుకు వచ్చి "అయ్యో... అయ్యో..." అంటూ

కేకలు పెట్టాడు. నలుగురయిదుగురు పోగయారు. కొంతమంది నీళ్ళు చల్లారు. చెవులు మూశారు మరికొందరు. ఎలాగయితేనేం ఆసుపత్రికి పోయి కొంత పరిచర్య, వైద్యం జరిగిన తర్వాత అతనికి స్పృహ వచ్చింది. తిరిగి ఈ లోకం అతని కళ్ళముందర కనపడింది.

మొట్టమొదటగా అతనికి పోస్టాఫీసు గుర్తుకువచ్చింది. డబ్బుకోసం చొక్కా జేబు చూసుకున్నాడు. కనపడలేదు. కంగారుగా లేచి లాగూ జేబులు వెతుక్కున్నాడు. అతని జేబులో వుంచుకుని బయలుదేరిన పైకం ఈ గందరగోళంలో ఎవరి చేతులోకో జారిపోయింది. అతను గుండెలు బాదుకుంటూ 'డబ్బు... డబ్బు...' అంటూ అరవటం మొదలుపెట్టాడు. అతని మాటలకు నర్సు పరుగెత్తుకువచ్చింది. విషయం తెలుసుకుని పోలీసులకు కబురు పెట్టింది.

అతని డబ్బు తిరిగి రాలేదు. మధుపరీక్షకు కూర్చోలేకపోయాడు. అతనుగూడా అభిమానంతో ఎవరినీ చెయ్యిచాచి డబ్బు అప్పుగానైనా సరే ఇమ్మని అడగలేకపోయాడు. అతని అభిమానం విలువ అతని పరీక్షలకు సరిపోయింది. అవధాని, శాంతమ్మల హృదయాలు ఎంతగానో క్రుంగిపోయినాయి. మధుపరీక్ష పోవటం, తీసుకువచ్చిన అప్పు తీర్చడం కోసం వాయిదాలు ఇస్తూ ఉండటం.

మధు ఇంటికి వచ్చినప్పటినుంచి శాంతమ్మ, అవధానుల మీద గుర్రుగానే ఉన్నాడు. అతను నిరాటంకంగా నడుపుకు వస్తున్న దిగ్విజయయాత్రలో ఒక స్తబ్దత చేకూరింది. దానికి కారణం అవధానిగానే తోచింది. ఎదుటగా అవధాని విగ్రహం కనపడ్డప్పుడు ఏమీ అనలేకపోయినా, మనస్సు లోపల ఎంతో బాధగా ఉంది. అవధానికి తనమీద శ్రద్ధ ఉంటే డబ్బునంత అజాగ్రత్తగా పారేసుకునేవాడు గాదని అతని అభిప్రాయం. అతను ఆలోచించగా ఆలోచించగా మధుకు ఇంకో అనుమానం గూడా తోచింది. అసలు డబ్బు తీసుకువచ్చాడా, లేదా అని. డబ్బు ఎలా పోయిందో మధుకు తెలియదు. అతనికి తెలిసినదల్లా అవధాని దగ్గర డబ్బు ఎవరో దొంగిలించారని. ఆ మాటమీద నమ్మకం అంతగా కలగలేదతనికి. మండుటెండలో తలకూ, కాళ్ళకూ రక్షలేకుండా వెళుతూ దిక్కులేనివాడి మాదిరిగా రోడ్డుమీద పడిపోతే అతని దగ్గర డబ్బు అతిదుర్మార్గుడెవరో తస్కరించాడని అతనికి తెలియదు. ఆ మాట తెలిస్తే బాధపడతాడని ఎవరూ చెప్పలేదు అతనికి.

మధు పరీక్షలు వ్రాయకుండా ఇంటికి తిరిగి వచ్చినప్పుడు కలిగిన ఆత్మక్షోభ ఆ ఇంటిలో కొద్దిగా సర్దుకుంది. మధు హృదయంలో ఏదో అశాంతి బయలుదేరుతోంది. ఎవరిమీదనో కోపం. అది ఎవరిమీదనో తెలియదు. ఒక్కొక్కసారి తన మీదనే ఆగ్రహం కలుగుతుంది. ఆ కోపం అయినా ఎందుకోసమో తెలియదతనికి. తననెవరో దగా చేస్తున్నారని అనిపిస్తుంది. దానితోనే క్రుంగిపోతున్నాడు.

తరువాత సంవత్సరానికి డబ్బు పోగయింది. మధు పరీక్ష వ్రాసి వచ్చాడు. ఇంటికి రావటంతోనే అతనికి ఒక శుభవార్త అందింది. అవధానికి ఆడపిల్ల. సరళ అని పిలిచాడు మధు. ఆ పేరే ఖాయమయింది.

"సరిగ్గా పరీక్షల వేళకు... నా అదృష్టం..." అన్నాడు మధు నవ్వుతూ.

"మనందరి అదృష్టం నాయనా..." అంది శాంతమ్మ.

"ఈ అదృష్టం నా ఒక్కడిదే" అన్నాడు అవధాని.

పరీక్షలు ప్యాసయిన రోజున మధు ఒక కోరిక వెళ్లబుచ్చాడు. తను తన స్నేహితులతో హంపి దాకా పోయి వద్దామని అనుకుంటున్నానని చెప్పాడు. అవధాని మామూలు పరిస్థితుల్లో

అయితే 'తప్పకుండా' అనేవాడే. ఇప్పుడు ఆడపిల్ల. శాంతమ్మ సంపాదన ఆగిపోయింది. అవధాని ఒంట్లో ఓపిక లేక కొన్ని సానాలు మానివేయవలసి వచ్చింది. పసిపిల్లలకు ఆముదం అనీ, ఇంట్లో రొట్టె అనీ కనపడకుండా ఖర్చు పెరిగిపోతూ వచ్చింది.

"ఇప్పుడు కాదులే... ఈసారి ఎప్పుడయినా పోదువుగాని..." అని చెబుదామనుకున్నాడు గాని ఆ మాట తన నోటివెంట అనలేకపోయాడు. ఆ మాట శాంతమ్మతో చెప్పాడు. ఆమె కాస్తా మధుకు ఆ మాట చేరవేసింది.

"చూస్తున్నావు గదు బాబూ ఈ అగచాట్లు... అప్పుడు పోయిన డబ్బు తీర్చటానికే వాయిదా డబ్బు చెల్లించటం కష్టంగా ఉంది... నువ్వు చూసి మరీ అడుగుతుండాలి నాయనా" అంది.

మధు చాలా తీవ్రంగా ఆలోచించాడు. స్నేహితుల దగ్గరనుంచీ ఉత్తరాలమీద ఉత్తరాలు వస్తున్నాయి. వెంటనే బయలుదేరి బెజవాడలో కలుసుకుంటే అక్కడినుంచి ప్రోగ్రాం వేసుకుని నెలరోజులపాటు తిరిగి వద్దామని. డబ్బు లేదని చెప్పటానికి అభిమానం అడ్డువచ్చింది. స్నేహితుడొకడు ఇతని సంగతి కొద్దిగా తెలిసున్నవాడు "డబ్బును గురించి నువ్వేమీ బెంగపెట్టుకోకు... నేను సర్దుతాలే..." అంటూ వ్రాశాడు. మధు ఆ ఆసరా చూసుకుని వెళ్ళిపోదామనుకున్నాడు.

"మీ దగ్గర డబ్బు లేకపోతే పని మునిగిపోదులే... నేను ఇంకోళ్ళ దగ్గర తీసుకుని వెళుతున్నాను" అన్నాడు మధు.

"ఎక్కడిది డబ్బు..." అవధాని సంశయంగా అడిగాడు. మధుకుచర్రున కోపం వచ్చింది. "ఎక్కడిదో అక్కడిదిలే..." అంటూ మధు గదిలోకి వెళ్ళిపోయాడు. శాంతమ్మ అక్కడకు వచ్చి వాడి తీరే అంత. మీరేం మనసులో పెట్టుకోకండి... నేను కనుక్కుంటాగా" అని మధు వెనకనే గదిలోకి వెళ్ళి "ఏం మధూ... డబ్బు ఎక్కడిది... స్నేహితుల దగ్గర తీసుకుంటే తప్పు గాదూ..." అంది శాంతమ్మ అతి శాంతంగా. మధు ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు. 'నువ్వేం చెప్పనక్కర్లేదులే....' అన్నట్లుంది ఆ చూపు. శాంతమ్మ ముఖం ముడుచుకుని వచ్చేసింది.

వాళ్ళు చెప్పిన మాటలు వినకుండా మధు వెళ్ళిపోయాడు. తన డబ్బును గురించే అతను ఆలోచించగలిగాడు గానీ తన అన్నయ్య కుటుంబం ఏ రీతిగా గడుస్తుందో, ఈ పసిపిల్ల భవిష్యత్ ఏమిటో అని వీసమంతయినా ఆలోచించలేదు.

"చూశావుగా... పాముకు పాలుపోస్తే ఇలాగే అవుతుందిట... తిన్నామో, చచ్చామో వాడికేమీఅక్కర్లేదు... ఇంత బాగుపడి మంచి ఉద్యోగం సంపాదించుకుంటాడని చదువు చెప్పిస్తే... పెద్దవాళ్ళనూ, తనకోసం కష్టపడ్డవాళ్ళనూ గూడా చూడక అధ్వాన్నపు సంస్కృతి అలవాటు చేసుకున్నాడు. అంతా నీ మూలానే వచ్చింది..." అన్నాడు అవధాని.

"చిన్నతనం. మీరు మరీ గడబిడ చేయకండి... ఈరోజుల్లో తిరిగి రావాలని ఉండకపోతే... ఇంకెప్పుడు ఉంటుంది గనక" అంది శాంతమ్మ.

"సమాధానాలకేం వెతుక్కోనక్కర్లా..." అంటూ అవధాని వెళ్ళిపోయాడు.

మధు ఇంజనీరింగ్ పరీక్షల్లో యూనివర్సిటీలో మొట్టమొదటివాడుగా ఉత్తీర్ణుడయ్యాడు. ఆ సంగతి ఇంట్లోవాళ్ళకి తెలిసిన తర్వాత అంత కోపంలో గూడా అవధాని "వెధవ... ముక్కుమీద కోపంగాని... బుర్ర గట్టిదే..." అన్నాడు. "మీ తమ్ముడు గదూ..." అంది శాంతమ్మ.

మధు అమెరికాలో పెద్ద కోర్సు చదువుకోవటానికి గవర్నమెంటు స్కాలరషిప్ వచ్చింది. అది ఇంటిలో ఎవరికీ సంతోషాన్ని కలిగించలేదు. మధుకు మటుకు ఆనందం పట్టలేనంతదిగా

తయారయింది ఆ విషయం. అమెరికాలో మూడేళ్ళుండాలి. వాళ్ళు పెద్ద కోర్సు చెప్పిస్తారు. దానికయే ఖర్చంతా గవర్నమెంటు భరిస్తుంది. తను నిక్షేపంగా కాలుమీద కాలువేసుకుని ఈ మూడు ఏళ్ళు గడుపుతే తరువాత తన అదృష్టాన్ని బట్టి పెద్ద ఉద్యోగం వస్తుంది.

ఆ కాగితం తీసుకుని మధు అవధాని దగ్గరకు వచ్చినప్పుడు అవధాని చికాకుపడుతూ కాగితం తీసి కింద పారేశాడు.

"అదేమిటనుకున్నావు..." అమితంగా ఆశ్చర్యపడుతూ అడిగాడు మధు.

"నా కన్నీ తెలుసు... ఏం చేద్దామనుకుంటున్నావేమిటి ఆ కాగితంతో... తీసికెళ్ళి ఆ పొయ్యిలో పారేసిరా... దేనికయినా ఒక హద్దు అంటూ ఉండక్కర్లా... బ్రతికి ఉన్నంతకాలం చదువేనా... చదివిందేదో చాలులే... అదృష్టం ఉంటే దానితోనే మంచి ఉద్యోగం రావచ్చు నీకు..." అన్నాడు అవధాని.

"అదృష్టం బాగుంటే ఈ చదువుగూడా ఎందుకు .. మన చదువులు, కృషినిబట్టే అదృష్టమూ మారుతూ ఉంటుంది" అన్నాడు మధు కొంచెం సణుగుతున్నట్లు.

"ఎందుకో సణుగుడు... నీ మనస్సులో ఉన్నదేమిటో నిక్కచ్చిగా చెప్పేసెయ్యి . నువ్వు ఇంక చదవటం ఇష్టంలేదు నాకు, సరేనా... అదే నా నిర్ణయం..." అన్నాడు అవధాని.

మధు రుసరుసలాడుతూ వెళ్ళిపోయేసరికి శాంతమ్మ వచ్చి "మెల్లిగా సర్ది చెప్పాలి గాని... అట్లా గదమాయిస్తే ఎట్లాగండి... వాడికి నేను నచ్చచెపుతానుగా..." అంది.

"నచ్చచెప్పు... ముద్దులు గుదుస్తున్నాడు పసిపాపాయి కదూ. . ఏం ఆ మాత్రం అర్థం చేసుకోలేడూ... ఇంతవరకు కడుపునిండా తినకుండా వాడికి డబ్బు కుమ్మరిస్తుంటిమి... అసలువాడికి ఏ కోశాన్నైనా విశ్వాసం అనేది ఉందా..." అని "...నిన్ను చూసినప్పుడల్లా నా గుండెలు తరుక్కుపోతూ ఉంటాయి... ఆ చీరె ఏమిటి... మధుకు ఒక్క నెల డబ్బు పంపించకపోతే నీకు కొత్త చీరెలు ఎన్ని వచ్చేవి... మూడేళ్ళపాటు అమెరికా పోతాడట... ఈ లోపున మన గతేం కావాలి... నా సంగతే చూడు... అరవై ఏళ్ళ ముసలివాడిగా ఉన్నాను... నా జీవితం అంతా వీడికే ధారపోశాను... ఎందుకు... కొంచెం గూడా స్వార్థం లేకుండా పనులన్నీ చేసుకుపోతుంటే ఈ భూమిమీద పడి బ్రతకటమెందుకూ... వాడు అమెరికా వెళ్ళటం నాకు ససేమిరా ఇష్టం లేదు... అదృష్టం వస్తుందిట అక్కడకు పోతే...దానిని గురించి మనమిక్కడ ఎన్ని అవస్థలుపడ్డా సరే వాడికేం పట్టదు... వూరికే వచ్చింది గదా అని ఎవరయినా విషం తాగుతారా... పోయి చెప్పు... వాడు అమెరికా వెళ్ళటానికి భూమి తలక్రిందులయినా వీలులేదని చెప్పు... ఇది నా ఆఖరిమాటని చెప్పు... ఫో... అవతలకి" అవధాని చివాలున లేచి తుండుగుడ్డ భుజంమీద వేసుకు వెళ్ళిపోయాడు.

శాంతమ్మ మధుతో ఎంతసేపో మాట్లాడింది. మధు ఒప్పుకోనేలేదు. ఇంతకాలం అవస్థ పడ్డవాళ్ళు ఇంకొక మూడేళ్ళు అవస్థ పడలేరా... అన్నాడు. మధు వేసే చదువుకున్న ప్రశ్నలకు శాంతమ్మకు వెంట వెంటనే సమాధానాలు దొరకలేదు. లోపల మధు అమెరికా వెళ్ళి వస్తే ఇక్కడ పెద్ద ఉద్యోగం దొరుకుతుందనే ఆశ మాత్రం శాంతమ్మ మనస్సులో కదలాడుతూనే ఉంది. మధు తాను అమెరికా వెళ్ళటం ఖాయం చేసుకున్నాననీ, తన జీవితంలో జరగబోయే పెద్ద ప్రయత్నాలకు, సంకుచితమూ, స్వార్థపరమూ అయిన ఆలోచనలతో తన భావిజీవితానికి నలుపు తేవద్దనీ చెప్పాడు. శాంతమ్మ మనస్సు కొద్దిగా గాయపడింది. భావిజీవితాన్ని మలినం చేస్తామని మధు భయపడుతున్నట్లు విన్నప్పుడు శాంతమ్మ పెదిమలు కోపంతో వణికాయి.

అనిర్వచనీయమైన ఆగ్రహం ఆమెచుట్టూ దావానలంలా చుట్టివేసింది.

"నీ జీవితం మలినమవుతుందా... దానికి మేము సుముఖులముగా ఉన్నామా... నీ చదువూ సంస్కారం నీకు నేర్పినవి ఇవేనా... ఎందుకు ఈ చదువులు తగలబెట్టనా..." అని మండిపడుతూ రివ్వున వచ్చేసింది. మధు అంతకంటె చికాకుపడుతూ బయటకు వెళ్ళిపోయాడుగానీ పిన్నమ్మకు కోపం రావటం, అదిగూడా ముఖాన అనెయ్యటం ఇదే మొదటిసారి. మధు తట్టుకోలేకపోయాడు. శాంతమ్మను క్షమాపణ అడుగుదామనుకున్నాడు. క్షమించమని ఇంట్లో అయినవాళ్ళని అడగటం బహుకృతకమైనదిగా ఉండటమే కాకుండా వాళ్ళని మోసం చెయ్యటానికి మాత్రమే ఉపయోగిస్తుంది. అటువంటి తప్పు తిరిగి చెయ్యకుండా, చేసిన తప్పుకు పశ్చాత్తాపం పొందితే దానికి క్షమాపణ దానంతట అదే దొరుకుతుంది. ఇది మధు పుస్తకాల్లో చదువుకున్న విషయం. అది ఎవరో అనుభవం మీద వ్రాసినదే అయి ఉంటుంది. ఎలా క్షమాపణ అడగాలో మధుకు తెలియలేదు. అసలు క్షమాపణ ఎందుకు అడగాలి. తనేం తప్పు చేశాడు గనుక. అదృష్టం ఆహ్వానిస్తుంటే మోకాళ్ళు అడ్డుపెట్టటం ఎందుకనేగా...? ఎవరు అడ్డుపెడుతున్నారు. తనకు అదృష్టం వస్తుంది. నిజమే. ఎప్పుడది? అమెరికా వెళ్ళి మూడేళ్ళు చదివి వచ్చిన తరువాత. ఈ మూడేళ్ళు అవధాని, శాంతమ్మలు ఎలా కష్టపడాలి. ఏ నెల కష్టపడకపోతే అప్పుడు నోటిలోకి నాలుగు వేళ్ళు పోవటం కష్టమయిన ఈ పరిస్థితుల్లో వారి కుటుంబం సంగతి ఎవరు చూస్తారు. దిక్కులేని పక్షుల్లా అయిపోతుంది ఆ కుటుంబం. అందుకు తోడు పసిపిల్ల సరళ. అవధాని ఆరోగ్యం చెడిపోయింది. అప్పుల బాధ ఎక్కువయింది. శాంతమ్మను చూస్తే అతని గుండెలు తరుక్కుపోతూ ఉంటాయి. మగవాడు కాబట్టి కళ్ళనీళ్ళు పెట్టటం లేదుగాని అంత దుర్దశ అనుభవిస్తూనే ఉన్నాడు.

అదంతా ఒక ఎత్తు. తన భావిజీవితం ఒక ఎత్తు. ప్రతి జీవికి భగవంతుడు ప్రసాదించేది ఒకే ఒక జన్మ. ఆ జన్మలోనే సుఖాలు పొందినా, కష్టాలు పడినా, కీర్తినార్జించినా, అప్రతిష్టపాలయినా... అన్నీ ఆ ఒక జన్మవరకే పరిమితమై ఉంటాయి. కష్టాలు కోరి తెచ్చుకుని పడటం చేతకానివాని లక్షణం. సుఖాలు సంపాదించటం ప్రయోజకుని లక్షణం. అందులో సౌఖ్యం కనుచూపులో కనపడుతున్నపుడు దానికోసం పరుగెత్తకుండా దారిలో ముళ్ళు ఉన్నాయని, ఎవరో వద్దంటున్నారని మానివెయ్యటం దుర్బలుని తత్వం. ధైర్యంగా ముందుకు పోయి ఆ అదృష్టాన్ని సాధించటం తన ముందు కర్తవ్యం. మధు ఎంతగా ఆలోచించినా అమెరికా వెళ్ళటం సాహసం, మంచిపని. ఆగిపోవటం అతి సంకుచితమైన దృక్పథంతో చేసిన ఒక అనాగరిక లక్ష్యం. అంధుకనే మధు అమెరికా వెళ్ళటం ఖాయం చేసుకున్నాడు. తనను గమ్యానికి బహుదగ్గరగా తీసుకువచ్చిన గుర్రం ఆయాసపడుతుంటే దాని యోగక్షేమం చూడకుండా గమ్యాన్ని దృష్టిలో పెట్టుకు పారిపోతున్న దౌష్ట్యం అతనికి కనపడలేదు. శాంతమ్మ కొద్దిగా చూపించటానికి చేసిన ప్రయత్నం వ్యర్థమైపోయింది. శాంతమ్మ అవధానులను ఇక్కడ వదిలేసి, గమ్యం వెతుక్కుంటూ మధు అమెరికా వెళ్ళిపోయాడు.

రెండు రోజులు ఆ ఇంటి పొయ్యిలో పిల్లి లేవలేదు. ఇది సామెత కోసం చెప్పింది కాదు. అవధాని అన్నం వండమని అడగలేదు. శాంతమ్మకు వండాలని తోచలేదు. సరళ... చిన్నపిల్ల పాలు త్రాగటం వరకే తెలుసు. మధు వెళ్ళిపోయాడు. మండుతున్న జ్వాలల్లో నెయ్యి చిలకరించి పోయాడు. అవధాని హృదయం భగ్నమంది. శాంతమ్మ హృదయం కుమిలిపోయింది. తను చేసుకున్న పురాకృతపుణ్యం అనుకుంది. ఎవరినీ పల్లెత్తు మాటయినా అనకుండా లోపల

క్షోభించిపోయింది.

అవధానికి అప్పులబాధ పెరిగిపోయింది. మార్వాడీలకు వడ్డీలు ఇవ్వటంతోటే సరిపోతోంది. అసలు తీరే మార్గం కనుపించటమే లేదు. ఇంట్లో ఒక్క పూట భోజనాలు. రాత్రిపూట కొంచెం పిండి వండుతుంది. ఒక్కొక్క రోజు అదీ ఉండదు. కడుపునిండా నీళ్ళు తాగి కాళ్ళు ముడుచుకుని పడుకుంటారు. సరళకు తల్లిపాలు ఉండటంలేదు. డబ్బా పాలుపోసుకునే తాహతులేదు. పిల్ల ఊరికే ఏడ్చి ఏడ్చినిద్రపోతుంది. శాంతమ్మ జోల పాడదు. పిల్ల ఎందుకు ఏడుస్తోందే... అని అవధాని అడగడు.

అదీ వారి కార్యక్రమం. మూడేళ్ళు గడవాలి. మధు విమానంలో దిగుతాడు. తమకు అక్కర్లేనన్ని సౌఖ్యాలు మూటగట్టుకుని వస్తాడు. అదీ శాంతమ్మ ఆశయం. అనుకునే మాట. అవధానికి అర్థమవుతోంది. ప్రపంచం, మనుష్యుల తత్వాలు. పాములకు పాలు పోసి పెంచితే కాటు వెయ్యటం సామెత. మధు తననెంత దుఃఖంలో ముంచి వెళ్ళాడు! ఏ రోజుకారోజు ఎలా గడుస్తుందనే తన జీవితానికి మూడేళ్ళవరకూ దారీ, తెన్నూ లేకుండా చేశాడు. నది మధ్యలో తనకు ఆసరా దొరుకుతుందని ప్రాణాలు బిగపట్టుకుని పయనిస్తున్న తనకు ఇంకా మూడుసంవత్సరాల దూరం దాకా చేతికి అందకుండా వెళ్ళాడు. మూడేళ్ళ తర్వాత తన బ్రతుకు బాగుపడవచ్చు. ఈ పడవ దారిలోనే మునిగిపోతే! శాంతమ్మను ఎవరు ఒడ్డుకు చేరుస్తారు? కనీసం ఆమె మునిగిపోయేదాకానయినా ఎవరయినా చూడాలిగా! సరళ బ్రతుకేమైపోతుంది? అవధాని హృదయం నీరసంగా దడదడలాడుతుంది. కళ్ళనీళ్ళు పెట్టుకుంటే ఎవరయినా చూస్తారని ముఖం కడుక్కుని ఆఫీసుకు వెళ్ళిపోతుండేవాడు.

రెండునెలలు ఆఫీసుకు సెలవు పెట్టి విశ్రాంతి తీసుకుంటేగాని శరీరం బాగుపడదని వైద్యుని సలహా. శాంతమ్మ కళ్ళు సరిగ్గా కనపడటం లేదు. పెద్ద వయస్సు రాకపోయినా రాత్రింబవళ్ళు ఆ కుట్టుమిషను ముందర కూర్చుని బట్టలు కుడుతుంటే కళ్ళు పాడయిపోయినాయి. ఆమెకు ఇప్పుడు చూపు సరిగ్గా ఆనటం లేదు. కళ్ళకు సుస్తీ చేసిందనే బాధకంటే తన పని పాడయిపోయిందే ముందు ఎలా గడుస్తుందా అనే బాధ ఆమెను తీవ్రంగా ఖిన్నపరచింది.

అవధాని పోరు పడలేక శాంతమ్మ ఆసుపత్రికి పోతే కళ్ళల్లోకి ఏదో నీళ్ళలాంటి మందు వేసి పంపించారు. అది ఎందుకు వేస్తారో వేసేవాళ్ళకు తెలియదు. వేయించుకునేవాళ్ళకి కళ్ళు బాగుపడితే అదృష్టం అనేగాని ఆ మందు పనిచేస్తుందని ఎవరికీ నమ్మకం లేదు. శాంతమ్మ ఈ మందునే పదిరోజుల పాటు వాడింది. ఆమెకు కొంచెం దృష్టి ఆనటం మొదలుపెట్టింది.

ఆ రోజు మందు వేయించుకుని ఇంటికి వస్తే పొయ్యిలో న్యూసుపేపరు మండిపోతూ ఉండటం చూచింది. దాని ఎదురుగా అవధాని కూర్చున్నాడు. అతని ముఖంలో క్రోధం, మంట, అపహాస్యం, వేదాంత సంబంధమైన మిథ్యావాదం అన్నీ కనపడుతున్నాయి. అతని కళ్ళు నవ్వుతున్నాయో, మండిపడుతున్నాయో శాంతమ్మకే కాదు ఎవరు చూసినా అర్థం చేసుకోలేరు.

శాంతమ్మ పొయ్యిలోకి చూచింది. కాగితం తిరగబడింది. దానిమీద మధు ఫోటో ఉంది. కొంచెమయితే అంతా బొగ్గయిపోయేదే! శాంతమ్మ గబుక్కున ఆ కాగితాన్ని గుంజేసింది. మధు ఫోటో సగం కాలిపోయింది. నల్లగీతలు మిగిలిన భాగంలోకి వ్యాపిస్తున్నాయి.

"ఏమిటది... అలా చూస్తున్నారేమిటి..." అంది శాంతమ్మ కంగారుపడుతూ.

"కనపడటంలా మధు ఫొటో అది... అమెరికాకు పోతూ పూలదండలు వేయించుకుని తీయించుకున్న ఫొటో... ఇంజనీరింగులో పెద్ద చదువుల కోసం వెళుతున్న తెలుగు విద్యార్థులు... ఆ ఫొటో వేయించినవాళ్ళకు ఇక్కడ కారుచిచ్చు పెట్టిపోతున్నాడని ఒక్కళ్ళకయినా తెలుసునా? అందుకనే తగలపెట్టుతున్నాను. నా మనస్సు క్షోభ పెట్టిన తర్వాత వాడు ఎంత సంపాదించినా, ఎంత కీర్తి ఆర్జించినా అంతా నాశనమే..." అని శాంతమ్మ కొంగు పట్టుకులాగి "చూసుకో నీ చింకిపాతలు... నిన్ను ఈ దుర్భరదారిద్ర్యంలో వదిలి తరువాత కోటి రూపాయలు సంపాదించి కనకాభిషేకం చేస్తే మటుకు ఎవరికి కావాలి... మనస్సుకుకలిగిన కష్టం రూపాయలతో తూగిపోతుందా... నీ వుసురుకొట్టదూ వాడికి. నా కడుపులో ఇంత చిచ్చు పెడతాడా... తలెత్తుకు తిరగగలుగుతున్నానా... అప్పుల బాధ తీరేదెలా... ఈ అప్పంతా ఎవరికోసం చేశాను..." వాడికేమయినా ఆలోచన ఉందా... ఎందుకు వెధవ బ్రతుకులు... ఎందుకు ఫొటోలు... ఎవరిని మోసగించటానికి. అందుకోసమే పొయ్యిలో పడేశాను... పూర్తిగా తగలడితే సంతోషించేవాడిని... నా వుసురు కొడుతుంది... నా బాధ వాడికి స్వయంగా అర్థమయ్యేట్లు చేస్తే భగవంతుడికి ఒక కొబ్బరికాయ కొడతాను. అవధాని పెద్ద పెట్టున రొప్పుతూ గంటుతున్నాడు. శాంతమ్మ గద్గదంగా "మధును శపించకండి... మన జీవితాలెలాగో పాడయిపోయినాయి... వాడి జీవితం బాగుపడేట్లు ఆశీర్వదించండి..." అంది.

"ఆశీర్వదించాలా... నేనా... మధుని ఆశీర్వదించాలా... ఇంకా బ్రతికేవున్నాగా... పోయేనాడు ఆశీర్వదించి పోతాను... నాకు గుర్తుచెయ్యి..." అంటూ ముఖం చేతుల్లో కప్పుకుని పసిపిల్లవాడిలా రోదించాడు. శాంతమ్మ చూడలేకపోయింది. సరళను హృదయానికి గట్టిగా హత్తుకుని "వూరుకో అమ్మా..." తన్ను తానే సంబాళించుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

శాంతమ్మకు ఇప్పుడు కళ్ళజోడు కొంటేగాని చూపు ఆనకపోవటం అటుంచి, ముందు ముందు చూపు అసలు పూర్తిగా కూడా పోవచ్చునని ఒకటి నిర్ధారణ అయింది. కళ్ళజోడు పెట్టేముందు ఆపరేషన్ చేయించుకోవాలి. ధర్మాసుపత్రి అని పేరయినా అక్కడ నర్సులకీ, పైవాళ్లకీ ఏదో కొద్దిగా ముట్టచెపితేగాని ఆపరేషన్ సవ్యంగా జరగదు. అందులో అపకారం ఏమీ జరక్కపోవచ్చుగాని విపరీతమైన నిర్లక్ష్యంగా జరుగుతుంది. అక్కడి పనివాళ్లు తమను చీమలను చూసినట్లు చూస్తారు. మర్యాద మాట అటుంచి వాళ్లకు ముందు ఏదైనా ముట్టచెప్పాలి. తరవాత కళ్లజోడు కొనుక్కోవటానికి, కళ్లల్లోకి మందు కొనుక్కోవటానికి డబ్బు కావాలి. ఆ డబ్బు తన ముందు జీవితం గడపటానికి ఒక పెట్టుబడిలాంటిది అని శాంతమ్మ అనుకుంది గాని, శాశ్వతంగా అంధురాలై పోతానన్న భయంచేత గాదు. రాబోయే సంవత్సరాలన్నీ తన కుట్టు మిషను ముందు కూర్చుని పనిచేసి సంపాదించాలి. అందుకోసం పెట్టుబడి ఇది. తనకు రాబోయే చూపు కుట్టుపనికోసం. ప్రపంచం చూడనక్కర్లేదు.

పేదవాళ్లకు వంటిమీద వున్న సొమ్ములు, బ్యాంకులోవున్న డబ్బు లాంటిది. అటువంటి నిక్షేపం ఇప్పటికే కరిగిపోయింది. ఇప్పుడున్నదల్లా మెళ్లో పుస్తెలతాడు. దానికి ఎంత బంగారం పెట్టించి చేయించారో తెలియదు కాని, ఇప్పుడు తూకం వేయిస్తే అర నవరసు తూగుతుంది. దానిలో వన్నె తక్కువని, తెల్ల బంగారం అని దుకాణంలో లక్ష వంకలు చెప్పి పాతిక రూపాయలు ధర కట్టారు. శాంతమ్మ ముక్కుమీదికి కళ్లజోడు వచ్చింది. మెడ క్రింది మాంగల్యం పసుపుకొమ్ముగా మారింది. ఆ రోజు పసుపుకొమ్ము కళ్లకద్దుకుని 'నా దృష్టిని తీసుకువచ్చావు-నాలో పాతివ్రత్య ప్రభావం వుంటే- నీలో సత్యమే వుంటే- నాభర్త ఆరోగ్యం కాపాడు-నా ముఖాన

కుంకుమకు ఎప్పుడూ రంగు మాసిపోకుండా చూడు' అని ప్రార్థించింది.

కలియుగంలో పసుపుకొమ్ముల ప్రభాపం అంతగానే వుంది. పాతివ్రత్యధర్మం భగ్నమైందని గాదు. ధర్మం నశించకపోయినా దాని ప్రభావం నశించిందనే చెప్పాలి. అవధాని ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. అతను మంచం ఎక్కవలసి వచ్చింది. ఆఫీసు నుంచి అదివరకు వచ్చే జీతం సెలవు జీతంగా మారి తగ్గివస్తోంది. శాంతమ్మ కుట్టుమిషను పని పెంచటమే కాకుండా, ఇరుగు పొరుగు వాళ్ళిళ్ళకు పని సహాయానికిగూడా పోతోంది. కారం కొట్టడం అంటే- పిండి విసరమంటే, అటుకులు దంచటమంటే ఇటువంటి పనులన్నీ చేస్తుంది. బేడలూ, పావలాలూ వస్తాయి. పైఖర్చు ఆదుకుంటూ వస్తోంది. సరళకు పాలుకూడా వస్తున్నాయి.

అవధాని ఎలాగో మంచమెక్కాడు. తనుగూడా మంచమెక్కితే ఇంటిపని ఎవరు చూస్తారు గనుక. అవధాని మందు ఖర్చు పోనూ, సాధ్యమైనంతవరకూ తను పుష్టిగల ఆహారమే తీసుకుంటూ తన ఆరోగ్యం కాపాడుకోవటానికి ప్రయత్నం చేస్తోంది. రెండవది సరళ ఆరోగ్యం కాపాడుతూ వుండటం, అది మరీ కష్టమయిపోతోంది. ఆసుపత్రిలో ఇచ్చే నీళ్ల మందులు పసిపిల్ల ఆరోగ్యాన్ని నిలదొక్కలేక పోతున్నాయి. రాత్రిళ్లు తెగ ఏడుస్తుంది. తను తెల్లవార్లూ మేలుకొని పిల్లను ఆడిస్తూ కూర్చోగలదు గాని, బట్టలు కుట్టేపని ఎవరు చూస్తారు? దానికి సమయం సరిపోదు. పిల్ల ఏడుస్తున్నా చూడనట్లే తన పనిలో నిమగ్నమయిపోతూ వుంటుంది. అవధాని చేసేదేమీలేక కుళ్లిపోతూ వుంటాడు లోపల లోపల.

మళ్లీ మొదటి తారీఖు వచ్చింది. ఎప్పుడూ జరిగే మాదిరే జరుగుతూవున్నా ఈసారి అవధానికి చాలా బాధగా తోచింది. అప్పులిచ్చిన పెద్దలంతా అతని ఇంటి చుట్టూ చేరారు. పది రూపాయల దగ్గర నుంచీ, వంద రూపాయలదాకా అందరికీ ఇవ్వవలసిన వాళ్లు. వాళ్లు అసలు తెచ్చుకోవటానికి రాలేదు. వడ్డీలు వసూలు చేసుకుపోవటానికి వచ్చారు. వాళ్లకు అసలుమీద విచారమే లేదు. వడ్డీలు వసూలు చేసుకోవటమే కష్టసాధ్యమయిన పని. నూరు రూపాయలకు నెలకు ఎనిమిది రూపాయల వడ్డీ. అటువంటి ఎనిమిది రూపాయలు అవధాని దగ్గర ఎన్నిసార్లు వసూలు చేశారో లెక్కలేదు. అసలును మించిపోయిన సందర్భాలు అనేకం. అందులో ఒక మార్వాడీకి రెండేళ్ల నుంచి ప్రతి నెలా ఎనిమిదేసి రూపాయలు చొప్పున ఇస్తూనే వున్నాడు. అసలు అట్లాగే వుంది. ఆరోజు అవధానికి ఆవేశం వచ్చింది. తనుకూడా కొద్దో గొప్పో సంపాదించి తెస్తున్నప్పుడు వడ్డీల వరకు సర్దేసి మిగతాది ఇంటికింద బొటాబొటిగా ఖర్చు పెట్టుకు వస్తుండేవాడు. ఇప్పుడంటే అతని సంపాదన పూర్తిగా తగ్గిపోయింది. అతనిమీదనే పై ఖర్చు మందులకనీ, మాకులకనీ అవుతోంది. ఇదంతా శాంతమ్మ నిర్వహించుకువస్తోంది. శాంతమ్మ సంపాదించిన సొమ్మును తినిపోవటానికి వచ్చిన ఆ పెద్దలను చూచేటప్పటికి అవధాని గుండెలు పగిలిపోయినాయి. మంచం పక్కనేవున్న చేతికర్ర ఎత్తి వాళ్లందరి తలలూ ఒక్కవేటున పగులగొడదామన్నంత ఆవేశం కలిగింది. హఠాత్తుగా మంచంమీద లేచి కూర్చుని "శనిగ్రహాల్లాగా మీరంతా ఎందుకు వచ్చారు-పొండి మీరంతా ఏ గంగలోనన్నా దిగండి-మీ డబ్బంతా మీకు ఇప్పటికే ముట్టింది. పైన వడ్డీగాగూడా కొద్దో గొప్పో మీ అందరికీ ముట్టింది. మా గడప తొక్కారంటే తలలు పగిలిచస్తారు. మమ్మల్ని పీడించి ఇలా నాశనంచేసి మీరేం బాగుపడతారు. ఈ లోకంతోనే అనుకున్నారా-పైలోకం లేదూ-మిమ్మల్ని అక్కడ శిక్షించరూ-" అని వురిమి వురిమి మాట్లాడి వాళ్లంతా అక్కడే కదలకుండా నిలబడటం చూసి తన అశక్తతను నిందించుకుంటూ ముఖం చేతుల్లో కప్పుకున్నాడు. శాంతమ్మ వచ్చి మామూలుగా వడ్డీలు

ఇవ్వబోతుండేటప్పటికి కర్ర నాధారంగా చేసికొని చకచకా రెండడుగులు వేసి శాంతమ్మమీద అనుకుని 'మీ బాకీలన్నీ ఎప్పుడో తీరిపోయినాయ్- పొండి-మీకు దమ్మిడికూడా ఇచ్చేది లేదు-' అని వీధి తలుపు వెయ్యబోయాడు. వాళ్లలో చాలామందికి ఆగ్రహాలు వచ్చినాయి. అందులో ఒకడు మీదపడి కొట్టటానికి కూడా సిద్ధపడ్డాడు. శాంతమ్మ వడ్డీలిచ్చి పంపిస్తానంది. ససేమిరా వీల్లేదన్నాడు అవధాని. వచ్చిన వాళ్లంతా తలొక మాట అనేక రకాలుగా బెదిరించి వెళ్లిపోయారు.

చెప్పినంతా చేశారు వాళ్లు. దావా వేశారు. కోర్టు వాళ్లు సమన్లు పంపించారు. కోర్టువాళ్లు చూసే ప్రామిసరీ నోటు కాగితాలు, సాక్ష్యాలు ప్రదర్శన జరిగింది. అవధాని తరపున శాంతమ్మ ఆ కోర్టులో హాజరయింది. జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది. వంద రూపాయలు తీసుకున్న వ్యక్తికి ఇప్పటివరకూ నూటయాభై రూపాయలు చెల్లించానంది. న్యాయం కలగజేయమని కోరింది. ఇల్లు వదిలి బయటకు పోయినా ముభావంగా తన పని కానిచ్చుకు వచ్చే శాంతమ్మకు ఆరోజు ఆవేశం వచ్చింది. హాలంతా దద్దరిల్లేటట్లు వివరించింది. సాక్ష్యమేదైనావుందా? అని అడిగారు కోర్టువాళ్లు. భగవంతుడే సాక్షి అంది శాంతమ్మ. దేవుని పేరిట నిజం చెపుతాను అని ప్రమాణాలు చేయించుకునే కోర్టువాళ్ళ కయినా భగవంతుని సాక్ష్యం ఎలా లభ్యం అవుతుంది గనుక. అక్కడ కూర్చున్న జడ్జీకి నిజం అంతా తెలుసు. న్యాయ నిర్వహణే తన ఉద్యోగ ధర్మమనీ, ధర్మపరిపాలన తన లక్ష్యం కాదనీ చెపుతూ, అర్థ రూపాయి వడ్డీ తీసుకున్న పైకం పది రోజుల్లోగా తీర్చివెయ్యాలనీ, లేకపోతే తాకట్టుగా ఉన్న ఇల్లు వేలం వెయ్యవలసిందని తీర్పు ఇచ్చాడు. శాంతమ్మ అక్కడ బోనులోనే కుప్పగా కూలి పడిపోయింది. ఎవరో సహాయం చెయ్యటానికి వస్తే వాళ్లని గద్దించి పొమ్మంటూ "బ్రతికి వున్నన్నాళ్లూ గ్రుక్కెడు నీళ్లు పొయ్యటానికి కూడా సందేహించే మీరంతా, చస్తే తీసుకుపోవటానికి తయారవుతారు.... మీ సహాయం నాకేం అక్కర్లేదు. మీ స్పర్శ తగిలితే నా వళ్లు మండిపోతుంది. పొండి...' అంటూ అరచింది. తనే బలవంతాన లేచి నుంచుని వాకిటి గుమ్మందాకా పోయింది. జడ్జీ ఇంటికి పోబోతున్నాడు. ఆమెను చూచి ఒక క్షణం నిలబడి 'అమ్మా...' అని పిలిచాడు. శాంతమ్మ నిర్ఘాంతపోయింది. "నన్ను క్షమించు...మీ సంగతి అంతా నాకు తెలుసు.... నా తల్లిదండ్రులు ఇలాంటి అవస్థలు పడే వెళ్లిపోయారు...అయినా మీకు న్యాయరీత్యా కోర్టులో ఏమీ చెయ్యలేక పోతున్నాను. మధు అమెరికా వెళ్లిన సంగతి కూడా నాకు తెలుసు. అప్పుగా అయినా సరే రెండువేలు యిస్తాను...తీసుకొని వాళ్ల బాకీలు తీర్చెయ్యండి...! మధు వచ్చి అప్పు తీరుస్తాడు... తల్లిలాంటివారు మీరు నా మాట కాదనకండి..." అన్నాడు ఎంతో ఆర్ద్రంగా. శాంతమ్మ అతని వంక ఒక క్షణం తదేకంగా చూచింది. మధును చూచినట్లుంది ఆమెకు. డబ్బు తీసుకుంటే తన యిక్కట్లు గడిచి పోతుంది. తిరిగి తీర్చేదెలా... క్రిందటి జన్మలో ఎవరి కెంత రుణపడి ఉన్నామో ఈ జన్మలో ఇన్ని అవస్థలకు గురికావలసి వచ్చింది. ఈ జన్మలో తిరిగి రుణం చేసి రాబోయే జన్మలో గూడా నికృష్టంగా ఎందుకు గడపాలి? శాంతమ్మకు సమాధానం వెంటనే దొరికింది. ఆ డబ్బు కాలకూటవిషం లాంటిది. వద్దు తనకు. చెయ్యి వద్దన్నట్లు చూపిస్తూ వీధిలోకి బుసలు కొడుతున్న కోడెతాచులా దూసుకుపోయింది.

అవధానికి అంతా అర్థమయింది. ముందు కర్తవ్యం బోధపడలేదు. కనిపిస్తూనే వుంది. ఇల్లు వేలం వేశారు. అప్పులన్నీ తీరిపోయినాయి. ఇంట్లో సామానుతో నడిచి వచ్చేసి నాలుగు రూపాయలు అద్దె పెట్టి కూపంలాంటి ఒక కొంపలోకి చేరారు. ఇల్లు విడిచి వస్తుంటే శాంతమ్మకు దుఃఖం ఆగలేదు. అవధానికి ఆగ్రహం పరవళ్లు తొక్కింది. దీనికంతా మధు కారణం. అతనే

అమెరికా పోకుండా వుంటే ఇటువంటి దుర్దశ ప్రాప్తించేది కాదు. వస్తూ వస్తూ ఇంటివాకిట్లో 'థూ' అని ఉమ్మేసి వచ్చాడు అవధాని. సరళ తల్లిని అనుసరిస్తూ తప్పటడుగులు వేస్తూ వచ్చింది.

శాంతమ్మకు కొంతకాలానికి గాని తెలియలేదు. ఆ యిల్లు కొన్నది జడ్జీగారి తాలూకు మనిషని. ఆ కొన్నతను ఇల్లు ఖాళీ చెయ్యబోతుండగా వచ్చి 'ఇంటికి అద్దె ఏమీ ఇవ్వకుండా వాళ్ల ఇష్టం వచ్చినంతకాలం అక్కడే వుండిపోవలసిందని, కనీసం మధు వచ్చేటంతవరకూ ఆ రెండేళ్లూ ఓపిక పట్టవలసిందని' చెప్పాడు. అవధాని హుంకరించాడు. శాంతమ్మ "అక్కర్లేదు నాయనా... మా బ్రతుకు మమ్మల్ని బ్రతకనీయండి..." అని చెప్పి వచ్చేసింది.

అవధానికి సుస్తీతోపాటు మానసికమైన వ్యాధి తోడ్పడి అతన్ని మరింత క్రుంగదీసింది. శాంతమ్మ పోయి ఆసుపత్రినుంచి మందు తీసుకువస్తుంది. రోగ లక్షణాలన్నీ అక్కడ చెబితే మందిస్తారు. డాక్టరు వచ్చి చూస్తే కొంచెం ధైర్యంగా ఉంటుంది అనుకుంది శాంతమ్మ. ఆసుపత్రి డాక్టర్లు ఇండ్లకు రారు. విడిగా ఎవర్నయినా డాక్టరును పిలుచువచ్చి చూపిస్తే మూడు రూపాయలు ఫీజు యివ్వాలి తరువాత మందులు కొనిమ్మని వారికి తోచిన మందులు వ్రాసి యిస్తారు. అవన్నీతను కొనగల తాహతులో లేదు. అదివరకు లేని ఇరకాటపు కొంపకు ఇప్పుడు అద్దెకూడా ఇచ్చుకోవలసి వస్తోంది. శాంతమ్మ ఇవన్నీ ఆలోచించినా భర్తకు వైద్యం సరిగా జరగటం లేదేమో, వ్యాధి ఎలా పరిణమిస్తుందో నన్న ఆవేదన, భయం ఎక్కువవుతున్నాయి. అవధాని ఒకప్పుడు సంప్రదింపుగా మాట్లాడుతాడు. ఇంకోసారి గంయిమంటూ విసుక్కుని తరువాత కుళ్లి కుళ్లి ఏడుస్తాడు.

"శాంత... నీ బాధలన్నీ నా గురించే గదూ... నా యింటికి వచ్చినప్పుడు నీ కేమైనా తెలుసా.... నువ్వే ఇంకో ఇంట్లో ఉంటే ఇలా బాధపడేదానివేనా...? అయినా నాకు మటుకు తెలిసి ఉంటే నిన్ను ఈ నరకకూపంలోకి రానిచ్చేవాడినా... భగవంతుడు నన్ను క్షమిస్తాడా?" అంటూ శాంతమ్మ చేతులు పట్టుకుని కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. సరళ మంచం మీదికి ఎగబ్రాకుతూ "న్న...న్న..." అంటుంది. శాంతమ్మ సరళను చూపిస్తూ "దీనికోసమయినా మనం బ్రతకాలి....అధైర్యపడకండి...ఇవ్వాళ పెద్ద డాక్టరును పిలుచుకువస్తాను" అని వెళ్లిపోయింది. మంచంకోడుకు ఒక నవారు కట్టి దానితో సరళ కాలు కట్టివేసింది. దాంతో సరళ అటూ ఇటూ పారిపోతుందన్న భయం లేదు. గానుగవెద్దులాగా మంచంకోడు నాశ్రయించుకుని పరిమితమైన పరిధిలో తిరుగుతూ ఉంటుంది. శాంతమ్మ వెళ్లి వచ్చింది.

సరళ గోడదాకా పోయి గోడమీదకు పాకుతున్న కాళ్ల జెర్రిని క్రిందకు లాగుతోంది. ఆ పురుగు గోడమీద పట్టు పట్టి వదలటంలేదు శాంతమ్మ వాకిట్లోకి వస్తూనే ఆ దృశ్యం చూచింది. కంగారుపడటమంటే ఇంతకంటే ఏమికావాలి గనుక. ఆ పురుగు కుట్టుతుందేమోనని భయం. ఆ భయం లేదు సరళకు. పట్టుకు ఒక్క గుంజు గుంజింది. అది కాస్తా మీద పడి కాలి మీదకుండా నేలమీదకు పాకిపోయి గోడలో చిన్న కన్నముంటే దానిలోకి దూరిపోయింది. శాంతమ్మ పరుగు పరుగున పోయి సరళను ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది. అవధానికీ సంగతి తెలియనేలేదు. మగతనిద్రలో వున్నాడు. శాంతమ్మ చెప్పలేదు.

వైద్యుడొచ్చిన తర్వాత అవధానికి రోగనిర్ణయమైంది. నిమోనియాలోకి దించిందని చెప్పాడు. శాంతమ్మను విడిగా పిలిచి చెప్పాడు గాబట్టి సరిపోయింది గాని ఆ మాట అవధాని వింటే అతని గుండె చెరువయి పోయేది. అతనికి త్వరలో సుస్తి నెమ్మదిస్తుందని, త్వరలో నలుగురితో

కలిసి తిరగవచ్చని ఆశతో బ్రతుకున్నాడు. నిమోనియా అని తెలుస్తే అతను తన భార్యాబిడ్డల భావిజీవితాల ఆలోచనతో క్రుంగిపోయి తన అంతాన్ని త్వరలోనే కొని తెచ్చుకుంటాడు. శాంతమ్మ ఏమీ చెప్పలేదు. వైద్యునికి విజిటింగు ఫీజు మూడు రూపాయలు ఇచ్చి మళ్లీ వస్తానని చెప్పింది. ఆయన ఒక ఇంజెక్షను పేరు వ్రాసి తీసుకురమ్మని చెప్పాడు. శాంతమ్మ తలఊపి 'అలాగే' అంది.

ఇప్పుడు శాంతమ్మ చేతిలో డబ్బు బొత్తిగా మెసలటం లేదు. వచ్చినదాంట్లో చాలా భాగం అవధాని మందులకూ, బత్తాయి పండ్లకూ అయిపోతోంది. మిగిలిన కొద్దితో తను శ్రమించటానికి కావలసిన ఓపిక వచ్చేందుకు శాంతమ్మ కొద్దో గొప్పో చేసుకుని తింటోంది. తనమీద అయే ఖర్చంతా తను బలంగా తిరగ్గలిగితే ఇంట్లో చాకిరీ చెయ్యటానికి, కుట్టుపనులు చెయ్యటానికి ఉపయోగపడుతుంది. శాంతమ్మకు అప్పుడప్పుడు మధు గుర్తుకు వస్తున్నాడు. కన్నబిడ్డకంటె ఎక్కువగా పెరిగాడు తన చేతుల్లో. కన్నప్రేమకంటే పెంపుడు ప్రేమ ఎక్కువంటే నిజంగాదూ మరి. అందరికీ తెలుసు కాబట్టి కృష్ణుడిని పెంచిన యశోదను చెప్పుకుంటారు గాని, శాంతమ్మ ప్రేమలో యశోదకు ఏమాత్రం తీసిపోదు. పై పెచ్చు మధు దూరదేశంలో ఉండటం శాంతమ్మకు మరీ బాధగా ఉంటోంది.

ఎప్పుడో రెండు నెలలకొకసారి అక్కడినుంచి ఉత్తరం వస్తుంది. కొండంతగా పొంగిపోయి ఉత్తరం విప్పిచూస్తుంది. అందులో అన్నీ అక్కడి సంగతులుంటాయి. తను ఎంత బాగా చదువుకుంటున్నదీ, తనకు మార్కులు ఎలా వస్తున్నదీ. శాంతమ్మ మామూలు పరిస్థితుల్లో అయితే ఇరుగు పొరుగులను పిలిచి చెప్పేది గాని, ఇప్పుడు చెప్పే స్థితిలో లేదు. ఇంత దగాచేసి అమెరికా పోయిన వాడిని గురించి ఇంకా మోజుపడటం బాగా లేదని ఇరుగు పొరుగు వాళ్లు అప్పుడే శాంతమ్మ చెవులో నూరిపోశారు. అందుకని వాళ్లతో ఇప్పుడేమీ చెప్పదు. అవధానితో గూడా వివరాలేమీ చెప్పకుండా ఊరికే ఉత్తరం వచ్చిందని మాత్రం చెపుతుంది. అవధాని 'ఊ' అని ఊరుకుంటాడు.

మధు ఇంకా ఏడాదికి గాని తిరిగిరాడు. రెండేండ్లు గడువుకు వచ్చిన శాంతమ్మ తనకు వచ్చిన ఆదాయంతోనే సరిపుచ్చుకు రాలేదు. అప్పుచేసిందని గాదు. మామూలు శ్రమకు మించిన రెట్టింపు పని చేస్తోంది. ఇప్పుడు తెల్లవారుజాము నాలుగింటికే లేచి ఇడ్డెన్లు చేస్తోంది. ఉదయం ఆరు మొదలు ఎనిమిది గంటలదాకా ఎరుగున్న ఇండ్లకు పోయి వతనుగా ఇడ్లీ యిస్తుంది. వాళ్లకు దానిమీద రాబడి గూడా సరిపోకపోవటం వలన ఇప్పుడు మధ్యాహ్నం పెసరట్లు వండుతోంది. వీధిలో 'అట్లు... అట్లు' అని అరవకపోయినా కొన్ని యిళ్లు వాడుకగా కుదుర్చుకొని వారికి రోజు ఇచ్చి వస్తుంటుంది. వాళ్లే సలహాలు చెపుతూ వుంటారు. ఒక రోజు ఉప్మా చెయ్యమని, ఇంకో రోజు గారెలు వండమనీ. శాంతమ్మ అవన్నీ చేసి ఎంతో అణకువగా, నేర్పుగా సంపాదించుకు వస్తోంది. ఎన్ని చేసినా డాక్టరు బిల్లుకు అందుకోవటం లేదు. తన తిండి సంగతి తప్పకుండా చూచుకోవాలి.

శాంతమ్మ కేమీ పాలుపోవటం లేదు. ఇరుగు పొరుగు వాళ్ల దగ్గరా, తను వతనుగా ఇడ్లీ వగైరాలు ఇచ్చే చోట కొంత డబ్బు అప్పుచేసింది. అది కొద్ది కొద్దిగా పెరిగి రెండు వందల రూపాయలకు చేరినాయి. మధు వస్తాడన్న ఒక్క ధైర్యంతోనే ఆమె వుల్లిమీది పేరులాగా నిలబడి వుండగలుగుతోంది.

ఒకరోజు ప్లీడరుగారింటికి సాయంత్రం పెసరట్లు ఇచ్చిరావటానికి పోయింది. ఆ రోజు

అవధానికి జ్వరం తీవ్రంగా వచ్చింది. మందుల వాడికి పెరిగింది. చేతిలో డబ్బు అయిపోయింది. పిల్లను నవారుతో మంచానికి కట్టేసి, పనిమనిషికి ఆరు అణాలు యిచ్చి భర్త దగ్గర కూర్చోపెట్టి తను పెసరట్టు అమ్ముకురావటానికి బయలుదేరింది. జ్వర తీవ్రతలో అవధాని ఏమిటేమిటో కలవరిస్తున్నాడు. శాంతమ్మకన్నీ అర్థం కాలేదు గాని ఒక్కటి మాత్రం తోచింది. అవధాని మధుని చూడాలని పలవరిస్తున్నాడు. మధు వస్తే తనూ, తన భార్య, బిడ్డ ఎటువంటి దుస్థితిలో వున్నారో చూపించి దానికి కారణభూతుడైన మధును వేలెత్తి చూపిస్తాడు. శాంతమ్మ కొన్నింటికి సమాధానాలు చెప్పి పనిమనిషిని ఏదైనా సమాధానం చెప్పగలిగితే చెప్పటం లేకపోతే 'ఊ' కొట్టడంగాని ఏదయినా చేస్తూ వుండమని చెప్పి వెళ్లిపోయింది.

శాంతమ్మ ముసలిదాన్నయిపోయాను అని మనసులో అనుకున్నా వయస్సులో ముసలిది కాలేదు. పైచూపుకు అంతకంటె కాదు. ముప్పై ఏళ్లు ఉన్నట్లు అనిపిస్తుంది బయటినుంచి చూచేవాళ్లకు, నిజానికయినా పైన ఇంకొక అయిదేళ్లుంటాయేమో. అంతకంటె ఎక్కువేం లేదు. తను అందంగా ఉన్నానా అనిగాని ఉంటానా అనిగాని శాంతమ్మకు ఈనాటివరకూ ప్రశ్న రాలేదు. ఈనాడు ప్లీడరుగారింట్లోకి పెసరట్లు తీసుకుపోతుంటే నిలువుటద్దంలో తన ముఖం ఆకస్మికంగా కనపడింది. తనేం అనాకారి గాదు. పమిట సర్దుకుని లోపలకు వచ్చి తనబేరం చూసుకొని వచ్చేస్తోంది.

ఇంటిల్లిపాదీ వంటింట్లో చేరి టిఫిన్ తీసుకుంటున్నారు. శాంతమ్మ ఒక్కతే వీధిలోకి వచ్చేస్తోంది. దారిలో గదులు దాటి బయటకు రావాలి. ఆఖరి గదిలో నిలువుటద్దం వుంది. దానిలోకి చూడకుండా పోదామనుకుంది. కాని ఆ గదిలోకి వచ్చేటప్పటికి అటువైపు చూడకుండా ఉండలేక పోయింది. తన విగ్రహం అద్దంలో స్పష్టంగా కనపడుతోంది. పైనుంచి కిందదాకా అద్దంలో తనను చూచుకుంది. తల కొంచెం కిందకు వంచి చూచింది. అద్దం క్రింద డ్రాయరు తీసివుంది. అందులో వందరూపాయల నోట్లు రెండు రెపరెపలాడుతున్నాయి. గాలి స్తంభించి పోయినట్లయింది శాంతమ్మకు. నోట్లు మటుకు అల్లలాడుతూనే వున్నాయి. వంటింటి వైపు చూచింది.

అంతా టిఫిన్ గొడవలో మునిగిపోయి ఉన్నారు. శాంతమ్మకు ఆ రెండు నోట్లు చేతిలో వుంటే ఒక పెద్ద గండం గడిచిపోతుంది. తాత్కాలికంగానైనా కొంత ఇంటిలో ఆర్థికమైన వత్తిడి సర్దుకుంటుంది. ఏమేమిటో ఆలోచించింది. మధు, అవధాని, సరళ–వీళ్లంతా గుర్తుకు వచ్చారు. వీళ్లంతా తనకేం అన్యాయం చెయ్యలేదు. మధు ఒక్కడే తనకు శత్రువు. అవధాని అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. తమ దుస్థితి మధుకు చూపించి 'ఇదిగోనోయి నీ తెలివితేటల పర్యవసానం' అని చెప్పాలి. శాంతమ్మకు ఆ మాట సవ్యంగానే తోచింది. తను పట్టుబడకపోతే ఇంట్లో పని సక్రమంగా గడిచిపోతుంది. అలా జరగకపోతే నిండా మునిగినవానికి చలిలేనట్లు దీనినిగురించి తను చింతపడాలి. తనను జైల్లో వేస్తారు. సరళ అనాథ అవుతుంది. అవధాని...ఏదో అవుతుంది. మధు చూచి భోరుభోరున తలుపుకు తలకొట్టుకొని ఏడుస్తాడు. తను జైల్లో వుండి నవ్వుతుంది. నవ్వుతుందా? ఎందుకు–దేన్ని చూసి? దేన్ని చూసో శాంతమ్మకు ఆసాంతం తెలియలేదు. గబుక్కున ఆ రెండు నోట్లు చేత పుచ్చుకుని వీధిలోకి బయలుదేరింది. ఆ నోట్లు బయటివాళ్లకు కనబడకుండా దాచుకోవాలనిగూడా తెలియలేదు. అలా పిచ్చిదానిలా పోతుంటే వీధి గుమ్మందగ్గరే ప్లీడరు సంచీ పుచ్చుకొని ఎదురయ్యాడు. శాంతమ్మ గుండె నోట్లోకి ఎగిరి పడినట్లయింది. ప్లీడరు గారికి శాంతమ్మను చూసేటప్పటికి ఆమె మీది మంచి అభిప్రాయమంతా

ఒక్కసారిగా ఎగిరిపోయింది. దొంగతనం చెయ్యటానికి సాహసించిన స్త్రీ దేనికయినా వెనుకాడక పోవచ్చు. ఆయనకు ముందు వెనుకలు తెలియలేదు. శాంతను చెయ్యి పట్టుకొని "ఎక్కడిది డబ్బు?" అంటూ చూచాడు. అటువంటి పరిస్థితి ఎదుర్కొనవలసి వస్తుందని శాంతమ్మ కలలో నయినా అనుకొని ఉంటే సమాధానం ఏదో చెప్పగలిగి ఉండేది. నిశ్చేష్టురాలై కొయ్యలాగ నిలబడింది. ఆసరా చూసుకొని ఎక్కడిది, ఎక్కడిది అంటూ దగ్గరగా తీసుకున్నాడు శాంతమ్మను. శాంతమ్మ ఒకక్షణం అలాగే నిలబడి విరుచుకు కింద పడిపోయింది. ఏమయింది?' అంటూ ఇంట్లోంచి పరుగెత్తుకు వచ్చారు ఆడవాళ్లు. ప్లీడరుకు మతిపోయినంత పనయింది. శాంతమ్మ చెయ్యి యింకా తన చేతిలోనే ఉంది. ఒక్కసారిగా చెయ్యి వదలిపెట్టి "చన్నీళ్లు తీసుకురండి.... చన్నీళ్లు...." అంటూ ఆ రెండు కాగితాలు జేబులో కుక్కుకొని దొడ్లోకి పరుగెత్తాడు.

శాంతమ్మకు వెంటనే తెలివి వచ్చింది. చుట్టుపక్కల చూచింది. బహుశా వీళ్లందరికీ తెలిసి ఉంటుంది. ప్లీడరు చేతుల్లో తనను చూసి ఉంటారు. తనెట్లా తలెత్తుకుని తిరుగగలదు. అందరి ముఖాల వంక పరిశీలనగా చూసింది. తనను ఎవరూ హేళనగా గాని, చులకనగా గాని చూడటం లేదు. ఎంతో గౌరవంగా, ఆదుర్దాగా చూస్తున్నారు. శాంతమ్మ లేచి నిలబడిన తర్వాత "ఏమమ్మా! పడిపోయావేం.... కళ్లు తిరిగినాయా!" అంటూ ప్లీడరు భార్య ఎంతో ఆప్యాయంగా పలకరించింది. ప్లీడరు వెంటనే అందుకుని "ఏం కాదు పద్మా.... వాళ్ల అబ్బాయి మధు లేడూ... నా ఎడ్రసుకు రెండువందల రూపాయలు ఇమ్మని పంపించాడు. అది చేతిలో పెట్టబోతుంటే విరుచుకు పడిపోయింది" అన్నాడు. శాంతమ్మ చేతిలో డబ్బుండటం ఇంట్లో వాళ్లు చూశారని ప్లీడరుగారి అనుమానం. శాంతమ్మ తన చేతుల్లో ఉండటం గూడా చూశారేమోననే సందేహం. ఈ రెండు సందేహాల నివృత్తికోసం రెండువందల రూపాయలు బలిపెట్టాడు. శాంతమ్మ నిజం చెప్పలేదు. బహుశా వాళ్లు తన చేతిలో పైకం ఉండటం చూచి ఉంటారు. కిమ్మనకుండా ఆ పైకం తీసుకుని వీధిలోకి వచ్చేసింది. ప్లీడరు కుటుంబం అంతా ఆ ముచ్చట చెప్పుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోతున్నారు. ప్లీడరు మటుకు వాకిట్లో ఉండి శాంతమ్మవైపు విషపూరితమైన ఒక చూపు చూశాడు. శాంతమ్మ స్పష్టంగానే చూడగలిగింది. తనకు రాబోయే ఒకానొక దురదృష్టానికి అపశకునంగా తోచింది. రివ్వున యింటికి వచ్చేసింది. శాంతమ్మ ఇంట్లో కొంతవరకు ఇప్పుడు బాగానే నడుస్తోంది. వ్యాపారం ఏదీ మానలేదు. చొక్కాలూ, లాగులూ కుట్టడం, ఇడ్లీ, పెసరట్లూ, పిండి కొట్టడం.... అన్నీ నిరాఘాటంగా సాగిపోతున్నాయి. అవధాని స్థితి మరింత అధ్వాన్నమయింది. మధుకు అవధాని ఒంట్లో సుస్తీగా ఉంటోందని మాత్రం వ్రాసింది. మధు పెద్ద ఉత్తరంలో కథలో వ్రాసినట్లు వ్రాశాడు. బ్రా॥శ్రీ॥ అన్నయ్యగారి దివ్యసముఖమునకు మొదలు 'చిత్తగించవలెను' దాకా ఎన్నో పొగడ్తలతో అన్నగారి ఆరోగ్యం గురించి అంతా కుమ్మరించాడు. అదంతా మధులో మార్పు అనుకోలేదు. ఉత్తరాలు వ్రాయటం నేర్చుకున్నాడే మధు అనుకుని ఊరుకుంది.

అవధాని కోరిక తీరలేదు. మధు ఇంకా కొద్ది రోజులకు తిరిగి వస్తాడనగా అతని ఆరోగ్యం పూర్తిగా చిక్కింది. కర్ర నాధారం చేసుకుని రోడ్డు మీదుగా చకచకా నడవగలుగుతున్నాడు. మళ్ళీ ఉద్యోగంలో ప్రవేశించాడు.

మధు ఆ రోజు వస్తాడని అనుకున్న రోజున ఎవరో వదంతులు తెచ్చారు - మధు అసలు రావటం లేదనీ, వచ్చేటట్లయితే ఎవరో అమెరికా దేశస్థురాలిని పెళ్ళిచేసుకుని వస్తున్నాడని. ఇవన్నీ అవధాని నమ్మలేదు. మధు స్వయంగా వ్రాసిన ఉత్తరం అతని దగ్గరే ఉంది. ఫలానా

రోజున స్టీమరులో బయలుదేరి, ఫలానారోజుకి, ఇండియా చేరుకుంటానని, ఫలానా రోజున స్వగ్రామానికి రైలుమీద చేరుకుంటానని. ఎవరో అన్నారట అవధానితో 'అమెరికా అంటే స్వర్గలోకం అనీ, స్వర్గంలోకి పోయినవాళ్ళు ఎవరయినా తిరిగి వస్తారా' అనీ. అదేదో తమాషాకి అన్నమాట గాని నిజంగాదని అతని మనస్సులో స్పష్టంగా వినిపిస్తోంది.

శాంతమ్మతో చెప్పి అవధాని బండి టైముకు స్టేషనుకు వెళ్ళాడు. అనుకున్న సమయానికి బండి వస్తోంది. అవధానికి కండ్లవెంబడి నీళ్ళు జలజలా కారుతున్నాయి. ముఖమంతా చల్లబడిపోయింది. వ్యగ్రుడై బండివైపుకు కర్ర వూపుకుంటూ వెళ్ళాడు. బండి ఆగింది. ఎక్కడని వెతుకుతాడు. తహతహలాడుతూ ఒక స్తంభానికానుకుని నిలబడ్డాడు. అతని మెదడులో ఎన్నో సంగతులు మెదిలాయి. మధు పసిపిల్లవాడుగా, ఎలిమెంటరీ స్కూలుకు పోయే బాలుడుగా, హైస్కూలుకు పోయే విద్యార్థిలా, కాలేజీ  కుర్రావాడిలా... ఎన్నో రకాలు. తను పెంచిన మొక్క పెరిగి పెద్దదవుతోంది. ఈ మూడేండ్లలో ఎంత మార్పు వచ్చిందో. ఎలా ఉన్నాడో? తన కొడుకు అయితే మాత్రం తనకు ఇంతకంటే ఏం ఎక్కువ ప్రేమ పొంగుతుంది. ఆ మూడేళ్ళూ... అవి అనుకున్నప్పుడు ఆ సంగ్రహమైన కాలవ్యవధిలో జరిగిన అనేకమైన మార్పులు  అతని కళ్ళముందర నిలిచాయి. దుఃఖం పొర్లుకువచ్చింది. ఆగ్రహం చెలరేగింది. ఆవేశం తొంగి చూసింది. అతనిలో ఎన్నో భావాలు. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. పెదిమలు వణుకుతున్నాయి. స్తంభానికి అలాగే ఆనుకుని నిశ్చలంగా చూస్తున్నాడు.

బండిలో జనమంతా దిగి వెళ్ళిపోతున్నారు. అవధాని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశాడు. మధు ఎలా ఉంటాడో అతని ఊహకు వెంటనే అందలేదు. చొక్కా, లాగు, ఆకుచెప్పులూ... ఇదీ అమెరికా వెళ్ళే ముందరి వేషం. ఇప్పుడెలా ఉంటాడు. పెద్ద సూటు వేసుకుని, హేటు పెట్టుకుని, కళ్ళజోడు, కాలినిండా బూట్లు... నోట్లో సిగరెట్టు... ఇంకా ఏమేమిటో. ప్రక్కన అమెరికను స్త్రీ ఎవరన్నా ఉందేమో... ఇదంతా తను కలెక్టరుగారిని చూచిన వేషం. అదే గుర్తుంది. అట్లాగే అనుకుంటున్నాడు. అట్లాగే కనపడ్డాడు. మధులాగానే ఉన్నాడు. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులోనుంచి దిగి పదిమందితో కలిసి నిలబడ్డాడు. అవధాని మధును గుర్తుపట్టగలిగాడు. పరుగెత్తుకు పోయి అతన్ని కౌగలించుకుందామనుకున్నాడు. ఎన్నాళ్ళయింది చూచి! కొన్ని యుగాలు గడిచిపోయినాయి. అతనికి కాళ్ళాడలేదు. మెల్లిగా కుంటుకుంటూ వాళ్ళున్న దగ్గరకు వెళ్ళాడు. "మధూ..." అన్నాడు. అతని కళ్ళవెంబడి నీళ్ళు ఏకధారగా కారిపోతున్నాయి. "వచ్చావా... నాయనా..." అన్నాడు. మధు అవధాని వంక తేరిపార చూచాడు. మాసిన గడ్డం, ముఖం అంతా బూజుపట్టినట్లుంది. ముఖమంతా నల్లబడిపోయింది. సుస్తీ తరవాత రాలిపోయి అక్కడక్కడ ఉంది. చింకి కోటూ, అతుకుల బొంతలాంటి ధోతి దుమ్ముకొట్టుకుని ఉంది. చేతిలో కర్ర ఊగిసలాడిపోతున్నది. మధు తలలో ఒక్కసారి ఎన్నో దృశ్యాలు వచ్చి చెరిగిపోయినాయి. అవధాని అన్నయ్య గుర్తుపట్టాడు. అతని సరంజామాలు, డాంబికాలు, కృతకమైన ఆచారాలూ, అలవాట్లు... అన్నీ దాటిపోయి పై అంతస్థులో ఉండే ప్రేమస్వరూపం అతనికి దర్శనమిచ్చినట్లయింది. అతని హృదయం నీరయిపోయింది. పెద్దపెట్టున "అన్నయ్యా" అని అరచి అతన్ని కౌగిలించుకుని కాళ్ళమీద పడదామనుకుంటున్నాడు. ఇంతలో అతనితోటి వచ్చినవాళ్ళలో ఒకళ్ళు చెయ్యి విదిలిస్తూ "ఎక్కడో పిచ్చిమేళంలా ఉందే... ఛో అవతలికి" అంటూ గదమాయించాడు అవధానిని. మధు మళ్ళా అమెరికా ప్రపంచంలోకి వచ్చాడు. అన్నయ్య... కాదు. అవధాని... పిచ్చి అవధాని... నిజంగా పిచ్చివేషమే. అతన్ని

కౌగలించుకోలేకపోయాడు. అతని కాళ్ళమీద పడలేకపోయాడు. ఎంతో ముభావంగా "వచ్చావా..." అన్నాడు. అవధానికి పెద్ద ఆఘాతం తగిలినట్లయింది.

మధుకుగూడా కొంత బాధగానే ఉంది. అవధాని వచ్చేటప్పుడు మంచి చొక్కా, ధోతి కట్టుకువస్తే తనకెంత మర్యాదగా ఉండేది. అన్నయ్య అని అందరికీ పరిచయం చేసేవాడు. తన ఇస్త్రీ బట్టలకు మకిలి అంటించుకునే అవసరం లేకుండా కౌగలించుకొనేవాడు. పిచ్చివేషంగా వచ్చి తనను అవమానించటమెందుకు?

అవధానికి ఆ వేషంలో ఆశ్చర్యకరమైన సంగతి ఏమీ కనుపించలేదు. అది అతని రోజూ రూపమే. పేదవాళ్ళకి మంచి దుస్తులు ఎలా వస్తాయి? రోగిష్టిగాడి ముఖం అందంగా, స్వచ్ఛంగా ఎలా ఉంటుంది?

అంత ఆవేశంగా దగ్గరకుపోయిన అవధాని కొంచెం వెనక్కు తగ్గాడు. "ఈయన మా బంధువు" అన్నాడు మధు అవధానిని మిత్రులకు చూపిస్తూ. వేళాకోళానికి అన్నాడేమో అనుకున్నారు మిగతావాళ్ళంతా. అవధానికి నమస్కారం పెట్టి ఫక్కుమని నవ్వారు. అవధాని హృదయం మండిపోయింది. కర్ర ఊగించుకుంటూ ఇంటికి వచ్చేశాడు. శాంతమ్మతో జరిగిన సంగతి చెప్పలేదు. మధు బండికి రాలేదనీ, అమెరికాలోనే ఉండిపోతాడనీ చెప్పాడు.

ఇలా చెపుతూ ఉండగానే మధు వాకిట్లో కారులోంచి ఇంగ్లీషు దొర వేషంలో వచ్చాడు. "ఎవరు?" అని శాంతమ్మ ఆశ్చర్యపడుతూ లేచి నుంచున్నది. అవధాని పళ్ళు పటపట కొరుకుతూ "బంధువుల ఇళ్ళకి రావటానికి నీకేం పని... పిల్ల పెంటల దగ్గరనుంచి ఎత్తి, నిన్నెత్తుకుని పెంచాను నేను... ఎంతమాత్రం అశ్రద్ధగా చూసినా నీకీ భూమిమీద నూకలుండవని నా ప్రాణాలన్నీ ధారపోసి నిన్ను ఇంతవాడిని చేస్తే నన్ను బంధువని పిలచి అవమానం చేయిస్తావటరా? 'అన్నయ్య' అని చెప్పటానికి నీకు నోరు పడిపోయిందా? అమెరికా పోయి నువ్వు చదువుకొచ్చింది ఇదేనా... ఫో అవతలికి" అంటూ మీదికి ఉరికాడు. శాంతమ్మకు అంతా అర్ధమయింది. ఆవేశంగా "వచ్చావా నాయనా" అంటూ దగ్గరకు వెళ్ళింది. మధుకి వాళ్ళ ఇల్లు చూచేటప్పటికి గుండెలు పగిలిపోతున్నాయి. సొంత ఇల్లు అమ్ముకొని ఇక్కడకు వచ్చి ఉంటున్నారని ఇప్పుడే తెలిసింది. అవధాని అవతారంలో గల రహస్యం ఏమిటో అతనికి సూక్ష్మంగా తోచినట్లయింది. శాంతమ్మ పాదాలకు నమస్కరించి, తరువాత అవధాని కాళ్ళముందర వాలి "నన్ను క్షమిస్తారా? నేను మిమ్మల్ని అర్థం చేసుకుంటాను. నా చదువు నాకా సంస్కారం కలిగించింది" అన్నాడు. అవధాని అంతకంటే మండిపోతూ "నీవు చేసిన పాపాలకు పశ్చాత్తాపం విమోచనం ఇవ్వదు... ఆ పాపాలన్నీ నిన్ను చుట్టుముట్టి నిన్ను క్షోభపెడుతాయి. అప్పుడే నీకు విమోచనం... ఫో అవతలికి... నా ఇంట్లో అడుగుపెట్టక" అంటూ అరిచాడు.

మధు మెదలకుండా ఇంట్లోకి పోతోతూ "సరళ కొంచెం ఎదిగిందే... నేను బాబునమ్మా..." అంటూ సరళను ముద్దు పెట్టుకున్నాడు. మధు భుజంమీద చేతులతో కొట్టుతూ "బాబు... బాబు..." అంటూ అరచి అల్లరిచేసింది సరళ.

భోజనానికి కూర్చున్నప్పుడు మధు సరళను ఒళ్ళో కూర్చోపెట్టుకున్నాడు. "బాబూ ఎక్కడినుంచి వచ్చావు..." అని అడిగింది.

"అబ్బో బోలెడంత దూరంనుంచి వచ్చానమ్మా. నీకోసం బొమ్మలు కూడా తెచ్చాను. నాన్నకు కోపం వచ్చింది..." అన్నాడు మధు శాంతమ్మ వంక చూస్తూ.

"నాన్నకు కోపం రాదూ... చేసే దౌర్భాగ్యం పనులన్నీ దానికేం తెలుస్తాయి... అవమానం పడి ఉండటానికి నాలో ఇంకా నెత్తురు చావలేదు" అన్నాడు అవధాని మండిపడుతూ. శాంతమ్మ సర్దుబాటు చెయ్యటానికి ప్రయత్నం చేసింది.

చిన్ననాటినుంచి పెంచిన అవధాని అంత మూర్ఖంగా మాట్లాడకపోతే మధుకి కోపం వచ్చేది కాదు. అదీ ఆశ్చర్యకరమైన సంగతే. అవధాని అంత మూర్ఖంగా ఎలా, ఎందుకు మారిపోయాడా అని. మధు మొండిపట్టు పట్టి ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని విడిచి అమెరికా పోవటం ఒకటే దానికి కనపడే కారణం. అది ఒకటే చాలు. మధ్యాహ్నం పూట శాంతమ్మ కూర్చుని తమకు కలిగిన ఇక్కట్లన్నీ ఏకరువు పెట్టింది. ఎవరెన్ని గండాలు గడిచి బయటపడిందీ, ఉన్న ఇల్లు కాస్తా అప్పులవాళ్ళ పాలు ఎలా అయిందీ అన్నీ చెప్పింది. మదు కన్నీరు కార్చాడు. "నువ్వు దేవతలాంటిదానివి పిన్నమ్మా... నీ చేతి చలవవలననే ఇన్ని ఇబ్బందులు గట్టెక్కగలిగినాయి అన్నాడు.

"నాదేముంది నాయనా... ఆయనగారు నిర్వహించుకు వచ్చిందే..." అంది శాంతమ్మ. "పిన్నమ్మా మీ అంగీకారానికి వ్యతిరేకంగా దూరదేశం వెళ్ళాననేగా అన్నయ్యకు కోపం. హద్దులు దాటి ఏ పనిచేసినా మనస్సుకు కష్టం కలుగుతుందన్నమాట నిజమే పిన్నమ్మా... కానీ ఇప్పుడు చూడు... నాకు ఏడువందల రూపాయల ఉద్యోగం... అమెరికా వెళ్ళి చదువుకుని రాకుండా ఉంటే ఇది సాధ్యపడేదేనా... అవధులు దాటిపోరాదంటారు గాని... త్యాగం చెయ్యకపోతే జీవితంలో ఏం సాధిస్తాం పిన్నమ్మా... ఈసారి త్యాగం నేను చేయగలిగిందేమీ లేకపోయింది.... మీ చేతనే ఆ త్యాగం చేయించాను... ప్రమాణం చేసి చెబుతున్నాను పిన్నమ్మా... సరళకు పెద్ద చదువు చెప్పించి ఉన్నతదశలోకి తీసుకువస్తాను. చూద్దువుగానిగా..." అన్నాడు. శాంతమ్మ కణతలు నొక్కుకుని "అట్లాగే బాబూ. నీ మంచి హృదయమే నిన్ను కాపాడుతుంది... మీ అన్నగారి హృదయం విరిగిపోయింది. అతుకుతుందని అనుకోను... అయినా చూద్దాం...!" అంది శాంతమ్మ. మధు ఆమె పాదాలకు నమస్కరించి వెళ్ళిపోయాడు.

మధు ఆరోజు సాయంత్రం బజారుకు పోయి ఇంట్లోకి కావలసిన సామానులన్నీ తెచ్చాడు. శాంతమ్మకు నాలుగు చీరలు కొనితెచ్చాడు. అవధానికి నాలుగు ధోవతులూ, ఉత్తరీయాలూ, కొత్త కోటు కొన్నాడు. సరళ మధుతోపాటు బజారు వెళ్ళింది. తనకు నచ్చిన అనేకమైన పరికిణీలు, జాకెట్లు తెచ్చుకొంది. మధుకు ఎప్పుడూ వంటిమీద మంచి బట్టలే... చేసిన తప్పులన్నీ క్షమించి నన్ను ఆశీర్వదించు అన్నయ్యా... ఇంట్లో ఏ లోపమూ లేకుండా నా యావజ్జీవమూ మిమ్మల్ని కనిపెట్టుకొని ఉంటాను... మీరు ఉద్యోగం చేయనక్కర్లేదు... మన పాత ఇల్లు మళ్ళా తిరిగి తీసుకుందాం... రోజులు కలిసివస్తే అక్కడే ఒక పెద్ద ఇల్లు వేసుకుందాం... మీరు విశ్రాంతిగా కూర్చుని భాగవత, భారతాలు చదివి సాహిత్యంలో ఒక కృషి చేసి నాకు ఉపదేశం చేద్దురుగాని..." మధు తలవంచుకుని అవధాని పాదాలు పట్టుకున్నాడు. అవధాని మనస్సు కొద్దిగా కరిగింది. మౌనంగా ఊరుకున్నాడు.

"ఈ కొత్త బట్టలు కూడా మీరు తీసుకోవాలి" అన్నాడు మధు.

"ఏమిటి నీ అంక్ష నాకు... నాకు అవసరమైనప్పుడు ఒక గుక్కెడు మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా, నామీద వ్యావహారికమైన కృతజ్ఞతైనా లేకుండా దూరదేశంలో ఉన్నావు... ఇప్పుడు నీ సహాయం ఏమీ అక్కర్లేదు. నువ్వు నాకు బట్టలూ దానం చెయ్యనక్కర్లేదు... ఇల్లూ దానం చెయ్యనక్కర్లేదు... నా ఉద్యోగం నన్నొక్కడినీ బ్రతికించగలదు..." అన్నాడు అవధాని విసురుగా.

మధుకి ఏమి చెప్పాలో, ఏమి చెయ్యాలో తోచలేదు. శాంతమ్మ వచ్చిఏదో చెప్పటానికి నోరు తెరిచేలోపునే అవధాని గుంజుకుంటూ "ఇదేమన్నా నాటకమనుకున్నారా... ఎవరు మాట్లాడవలసింది వాళ్ళు అప్పచెప్పి పోవటానికి... వాడికి నామీద ఉన్న భక్తి అంతా వెల్లడించాడు... వ్యాఖ్యానం చెయ్యటానికా... పొండి అవతలికి... నన్నిలా బ్రతకనీయండి..." అంటూ లేచిపోయాడు... అవధానిని ఎలా సమాధానపరచాలి అన్న సమస్యాపూరణం వారికి తోచనేలేదు.

ఇంట్లో తెచ్చిన కొత్త బట్టలన్నీ అలాగే ఉన్నాయి. అవధాని తన పాతకోటు వేసుకుని నీరుకాయి ధోవతితో బజారులో తిరుగుతున్నాడు. శాంతమ్మ గూడా కొత్తబట్టలు ముట్టుకోలేదు. మధుకి ఏదో వెలితిగాను, హాస్యాస్పదంగాను ఉంది. అవధానిని ఎలాగయినా ప్రసన్నునిగా చెయ్యాలని ఎంతో తాపత్రయపడుతున్నాడు. దీనికంతటికీ కారణం అన్నయ్యమీద ఆపేక్ష అని చెప్పటానికి వీల్లేదు. మధు ఇంటికి, మధు కొత్త ఉద్యోగరీత్యా అధికారులు, అనధికారులు అనేకమంది జీపుకార్ల మీద వస్తూ ఉంటారు. తను బాగానే మాట్లాడుతాడు గాని, ఎవరయినా వచ్చి "ఏమండీ మీ అన్నగారు ఇక్కడే ఉంటారుట... మాకు ఒక్కసారీ చూపించలేదేమండీ..." అని అడిగితే బిక్కముఖం వెయ్యవలసి వచ్చేది. బికారి వేషంలో ఉన్న అవధానిని తన అన్నయ్య అని చెప్పుకోవటానికి నామర్దాగా తోచేది. "ఇంట్లో లేడనో... ఇంకేదైనా సమాధానమో చెప్పి పంపుతూ ఉండేవాడు.

అవధాని తను తెచ్చిన మంచి బట్టలు కట్టుకుని కొంచెం నాగరికమైన మనిషిలాగా కనబడితే చేసేది చిన్న ఉద్యోగమే అయినా, మా అన్నయ్య అని గౌరవంగా, నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు. మధు హృదయం రోజురోజుకీ గాయపడుతోంది. పదిహేనురోజుల్లో వస్తానని ఉద్యోగసంబంధమైన పనిమీద వెళ్ళి వచ్చాడు. ఆ సమయం చూచుకొని శాంతమ్మ అవధానితో "వాడు పొరపాటని ఒప్పుకున్నప్పుడు... మీరు క్షమించి వాడిచ్చిన బట్టలు తీసికోరాదటండీ... మీరీ పిచ్చివేషంలో తిరుగుతుంటే నాకే ఎంతో కష్టంగా ఉంది... పెద్ద ఉద్యోగం చేస్తున్న మధుకి మాత్రం ఎలా ఉంటుంది? నామర్దాగా ఉండదుటండీ..." అంది ఎంతో మెల్లిగా.

"నామర్దాగా ఉంటుందే... నాకు తెలియదులే... వీడి నామర్దాలు, షోకులూ చూసేగా నేనింత దశకు వచ్చాను. ఇప్పుడు వాడితోపాటు ఆడటానికి నాకు ఓపిక లేదు. ఇవ్వాళ కొత్తబట్టలు కట్టగానే సంబరం కాదు. మళ్ళీ నీకూ నాకూ సంబంధం లేదని వాడన్నప్పుడు మళ్ళీ నీకు చింకి చీరె... నాకు చింకి పంచె చేతికి వస్తాయి. కష్టమో సుఖమో... మన బ్రతుకులు ఇలాగే వెళ్ళిపోనీ... మధ్యలో సిరితో తూగి తర్వాత మళ్ళీ అధోగతికి రాలేను..." అన్నాడు అవధాని. దానికి శాంతమ్మకు సమాధానం దొరకలేదు. అవునులేండి... అవునులేండి...' అంటూ సణుక్కొంటూ బయటకు వచ్చేసింది.

మధు ఊరినుంచి తిరిగి వచ్చిన తర్వాత శాంతమ్మ ప్రయత్నం గూడా విఫలమయినట్లు తెలుసుకున్నాడు. తన పాత ఇల్లు కొన్న జడ్జీ తాలూకు మనిషి వచ్చి ఎటువంటి పరిస్థితుల్లో తను ఇల్లు కొన్నదీ చెప్పి 'మీ ఇల్లు మీరు తీసుకోండి.... మీకు వీలున్నప్పుడు మా బాకీలు తీర్చండి' అన్నాడు. మధు వెంటనే సవ్యమైన వడ్డీకి ఒక ప్రామిసరీ నోటు వ్రాసి ఇల్లు స్వాధీనం చేసుకున్నాడు. మధు ఆ రోజునుంచి అక్కడే వుంటున్నాడు. భోజనం వేళకు అవధాని దగ్గరకు వస్తాడు. ఇంట్లో కావలసిన వస్తువులన్నిటికీ జాబితా ప్రకారం సామానులన్నీ ఇంటికి తెప్పిస్తాడు. శాంతమ్మ సంతోషంతో స్వీకరిస్తుంది. అవధాని మధ్య మధ్య చికాకుపడుతూ ఉన్నా ఇంట్లో

సరుకుల విషయం ఏమీ పట్టించుకోనట్లే మసలుతున్నాడు.

ఆ రోజు ఉదయం మధు మళ్లీ అవధానిని ప్రార్థించాడు. చింకి పాతలు వదలిపెట్టమనీ, కొత్త బట్టలు కట్టుకోవలసిందని. అవధాని గదిమి పంపించాడు. అదే రోజు మధును చూడటానికి ఒక పెద్ద ఆఫీసరు ఎవరో కారుమీద వచ్చాడు. వాకిటిదాకా వెళ్లి లోపలికి తీసుకు వచ్చాడు. అవధానికి వాకిట్లో అరుగుమీద చిరిగిపోయిన బట్టలు కట్టుకుని మాసిన గడ్డంతో పాత కోటు కుట్టుకుంటూ కూర్చున్నాడు. ఆఫీసరు వస్తూంటే దారిలో అంతా నిలబడి దణ్ణాలు పెడుతూంటే అవధాని కదలనైనా కదలకుండా ఉండటంచూచి ఆఫీసరు కొద్దిగా చిన్నపుచ్చుకొని లోపలకు వెళ్లాడు. మధు మంచినీళ్లందించి కుశల ప్రశ్నలన్నీ వేసిన తరువాత "ఇక్కడ మీ అన్నగారున్నారని చెప్పావనుకుంటాను...." అన్నాడు. మధుకి పెద్ద క్లిష్ట సమస్య వచ్చి పడింది. ఆఫీసరు ఎంతో గౌరవస్థుడు. ఆయనతో ఏమి చెప్పాలి అని వెంటనే తోచలేదు. 'ఇప్పుడు లేరండీ! బజారుకు వెళ్లినట్లున్నారు' అన్నాడు మధు.

"ఫర్వాలేదులెండి.... వాకిట్లో ఎవరూ కూర్చున్నది....?" సాధారణమైన ప్రశ్నే అయినా మధు చాలా కలవరపడ్డాడు. తటాలున "మా వంటమనిషండీ!" అన్నాడు. ఆ మాట స్పష్టంగా అవధాని విన్నాడు. భగ్గున మండిపోతూ ఇంట్లోకి రాబోతూ వుండేటప్పటికి ఆఫీసరు "అట్లాగా...మీ వాళ్లెవరైనానేమో అనుకున్నాను... ఏమీ మ్యానర్సు లేదు. మనిషి వస్తే నుంచోవటం కూడా తెలియదు" అంటున్నాడు. కుట్టుతున్న కోటు విసిరి మూలకు పారేసి అవధాని వగరుస్తూ, "ఇప్పుడు కూసిన కూత ఏమిటిరా... నేను వంటమనిషినా? సిగ్గులేదూ.... చావటానికి నీవు సిద్ధంగా వుంటే అమ్మ చెప్పిందని నీకు ప్రాణం పోశాను. నేను తలుచుకోకపోతే ఏమయిపోయేవాడివి. నిన్నింత వాడిని చేసి తమ్ముడివే అయినా కన్నబిడ్డకంటే ఎక్కువగా చూచిన నన్ను ఒకసారి కష్టపెట్టితే చిన్నతనమని ఊరుకున్నాను.... కష్టాల్లో వదలి దూరదేశం పోతే చూస్తూ ఏమీ చెయ్యలేక ఊరుకున్నాను. స్టేషనులో అవమానిస్తే నా చోటు కాదుగదా అని సహించాను.... నా ఇంట్లో నేను వండిన అన్నమే గదరా నువ్వు తిని బ్రతికి బట్ట కట్టింది.... ఛో అవతలికి.... నాకు ముఖం చూపించక..." అంటూ మీదకు ఉరికి మధును మెడపెట్టి బయటకు గెంటుతుండేటప్పటికి ఆఫీసరు కంగారుపడుతూ "మళ్లీ వస్తానని" పరుగెత్తుకు పోయాడు.

ఆఫీసరు పోగానే మధు లోపలికి వచ్చి "నేను ఇది తప్పుగా భావించి చెయ్యలేదు... తెలియక చేసిన తప్పులను క్షమించి నన్ను మన్నించమని కాళ్లావేళ్లాబడి ప్రార్థిస్తే మీరు ఊకొట్టలేదు.... నన్ను మన్నించలేదు.... నా హోదా పెరిగిగూడా మీరు చింకిబట్టలతో ఎదురై నేను చెప్పిన తర్వాత గూడా నన్ను అవమానపరిచారు... ఇవ్వాళ కావాలనే చేశాను...మీరు కోపంగానైనా కొత్త బట్టలు కట్టుకొని నన్ను క్షమిస్తారనుకున్నాను.... ఈ పూటతో నా ప్రయత్నం చివరి మెట్టుకు వచ్చింది. మీ క్షోభ మీరు పడండి. నేను వెడుతున్నాను. వెళ్లి తిరిగిరాను..." అన్నాడు. అవధాని మాట్లాడలేదు. శాంతమ్మ నిర్ఘాంతపోయింది. మధు లోపలకు పోయి బట్టలు ఒక సంచీలోకి తీసుకున్నాడు. అవధాని ఎంతో ఆవేదనతో భగవద్గీత ముందర వేసుకుని కూర్చున్నాడు. మధు సంచీ తీసుకుని వీధిలోకి చరచరా కోడెత్రాచులా వెళ్ళిపోయాడు.

* * * * *

శాంతమ్మ నిట్టూర్చింది. మధు, అవధానుల మనస్సులు మళ్లీ కలవాలనే ఆమె ఆకాంక్ష సరళను భుజంమీద వేసుకుని నిద్రపోగొట్టింది.

మధు వెళ్లిన వారం తిరక్కుండానే ఒక పెద్ద శుభలేఖ మధునుంచి వచ్చింది. తను పెళ్లి చేసుకోబోతున్నాననీ అంతా రావలసిందనీ, వేరుగా ఉత్తరం గూడా ఒకటి వ్రాశాడు. అవధాని చదువుకుని గిరవాటు వేశాడు. శాంతమ్మ తీసి కళ్ల కద్దుకుంది. ఎవరో వసంతట పెళ్లికూతురు. వూరూ పేరూ వ్రాయలేదు. 'వసంత' అని మాత్రం వ్రాశారు శుభలేఖలో.

శాంతమ్మ పెళ్లికి పోవాలని ఎంతో తాపత్రయం చూపింది. నిమ్మకు నీరెత్తినట్టు తొణకకుండా తిరుగుతున్నాడు అవధాని. మధు కబురుమీద కబురు పంపాడు. రోజూ రావలసిందని ఒక జీపుకారు పంపేవాడు. వచ్చిన కార్లన్నీ తిరిగిపోతున్నాయి. శాంతమ్మ పోరు ఎక్కువైంది. "బాబు పెళ్లికి వెడదామే" అని సరళ వూదర ఎక్కువయింది.

పెళ్లి ఇంకో రోజుందనగా రెండు కార్లమా నలుగురు మనుష్యులనూ పంపి బలవంతం చేసి తీసుకురమ్మని చెప్పాడు. వాళ్లు వచ్చి అవధాని ఇంట్లో తిష్ఠ వేశారు. అవధాని బయలుదేరి వస్తేగాని తాము కదలమనీ, మంచినీళ్ళు కూడా ముట్టమనీ వాకిట్లో మండిగం దగ్గరే కూర్చున్నారు. పదయింది. పన్నెండు అయింది. వాళ్ళు కదలటం లేదు. మంచినీళ్ళయినా తాగటం లేదు. ఆరోజు సాయంత్రందాకా అలాగే ఉండేటప్పటికి అవధానిలో చలనం కలిగింది, ఎవరిమీదో ఆగ్రహం వచ్చి వాళ్ళను హింసిస్తున్నట్టు.

తన కోపం మధుమీదికి ఇంకోరకంగా మళ్ళింది. తనతో చెప్పకుండా పెళ్ళి సంబంధం నిశ్చయం చేసుకుంటాడా? తను వెళ్ళకపోతే పెళ్ళిపీటలమీద ఎవరు కూర్చుంటారు? మధు స్వయంగా వచ్చి పిలుచుకుపోవలసిన ఈ శుభకార్యానికి తనకు కబురుచెయ్యటం, మనుష్యులను పంపటం అవమానించటం గాదూ? ఆ సంగతి స్వయంగా చూడాలి. పదిమంది ఎదుట ముఖం వాచేటట్టు చివాట్లు పెట్టాలి. అప్పుడు మధుకు పూర్తిగా తెలిసివస్తుంది.

అవధాని కోరుకునేది అయినా మధులో పరివర్తనం రావాలనే. తను మూర్ఖంగా ప్రవర్తించి బయలుదేరబోతున్న గుర్రాన్ని చర్నాకోలు దెబ్బతో ఆపినట్లు తమ సంబంధాన్ని జటిలంగా చేసుకున్నాడని అవధానికి తోచలేదు, తెలియదు.

అవధాని ఆ చింకిబట్టలతోటే, శాంతమ్మ, సరళతో పైబట్టలన్నా లేకుండా బయలుదేరాడు. అతని కార్యక్రమం ఏమిటంటే పెళ్ళిపందిర్లో అందరిముందూ చీవాట్లు పెట్టటం, భోజనం అయినా చెయ్యకుండా తిరిగి వచ్చెయ్యటం. అందుకనే పైబట్టన్నా లేకుండా బయలుదేరాడు.

మధు ఇంటికి కార్లు బయలుదేరినాయి. నాలుగు గంటల ప్రయాణం. పెద్ద పందిరి వేసి ఉంది ఇంటిముందర. అక్కడగూడా మధు ఆహ్వానించటానికి రాలేదు. అవధాని కారులోనుంచి రుసరుసలాడుతూ దిగాడు. శాంతమ్మ అతనికి ఇంటిదగ్గర చెప్పటమే కాకుండా, మర్యాదగా ప్రవర్తించమనీ, పెళ్ళి అభాసు చెయ్యద్దనీ మళ్ళీ ఒకసారి హెచ్చరించింది. అవధాని ఇంకా మండిపడుతూ...

"మధు ఎక్కడ... మధు ఎక్కడ..." అంటూ కేకవేస్తూ ఇంట్లోకి వెళ్ళాడు. లోపల పందిరి కిందా, బయటా గూడా పెద్ద పెద్ద ఉద్యోగస్తులు కూర్చుని ఉన్నారు. అవధానికి ఒక్కసారి చిన్నతనం అనిపించింది తన వేషం చూసుకునేటప్పటికి. అక్కడి వాళ్ళందరి కళ్ళూ తనమీదనే ఉన్నాయి. మళ్ళీ అపహాస్యం చెయ్యటానికే పిలిచాడా మధు తనను? అవధాని మళ్ళీ ఆలోచించి "మధు ఎక్కడ...?" అంటూ కేకలు వేస్తూ లోపలకు పోయాడు.

మధు ఎదురువచ్చాడు. పరుగెత్తుకుంటూ వచ్చాడు. అవదానిని గట్టిగా కౌగలించుకున్నాడు. తరువాత అతని పాదాలమీదకు వాలి "ఇంతమంది సమక్షంలో నన్ను క్షమించమని

అడుగుతున్నాను. నన్ను క్షమించనిదే నీ పాదాలను వదలను..." అంటూ పాదాలు గట్టిగా పట్టుకుని తల పాదాలమీద ఉంచాడు. అవధాని పక్కనే శాంతమ్మ నిలబడింది. మధు వంగటం చూసి సరళ అతని భుజంమీదికి ఎగబాకుతూ "బాబు... బాబు" అంటోంది. అవధాని మధును లేవదీశాడు.

"మధూ..." అంటూ ఎంతో ఆప్యాయతగా పిలిచాడు. ఆ స్వరంలో కోటి కోకిల కంఠాల మృదుత్వం ఉంది. "మధూ... మనిద్దరం భగవంతుడి క్షమకు అర్హులమౌదాం... నిన్ను క్షమించే శక్తి నాలో లేదు మధూ... నేను పాపిని... నిన్ను అర్థం చేసుకోలేక నీ మనస్సు కష్టపెట్టాను..."

అవధాని కంట తడిపెట్టాడు. శాంతమ్మ చూడలేకపోయింది. "మధూ... నాతో చెప్పకుండా ఈ పెళ్ళి ఎలా నిశ్చయించావు...?" అన్నాడు.

"నీతో చెప్పకుండా, ముందుగా తండ్రిలాంటివాడివి నీ అనుమతి తీసుకోకుండా అంత ముఖ్యవిషయంలో ఒక నిర్ణయం తీసుకుంటానా అన్నయ్యా... అలా అంటేగాని మీరు కదిలిరారనీ, నేను ఉంటున్న ఇల్లు చూడరనీ అలా చేశాను..." అన్నాడు. మధులోని ఆప్యాయత అవధానికి పూర్తిగా అర్థమయింది. అతని కళ్లనుండి నీరు జలజలా కారిపోయింది. రైలు స్టేషనులో అవధానిని చూసి హేళన చేసిన వ్యక్తులు గూడా అక్కడే ఉన్నారు. మధును అంత ఆప్యాయంగా మెప్పించుకున్న అవధానిని చూసి ఆశ్చర్యపోయారు. మధు వాళ్ళందరి ముందర అవధానిని చూపిస్తూ, "మా అన్నయ్య... కన్నతండ్రిలేని లోటు తీర్చిన పెంపుడు తండ్రి... వీరి చలవ, ఆశీర్వాదాలవలననే నేను ఇంతవరకు రాగలిగాను..." అన్నాడు మధు. అక్కడి వారంతా అవధానికి నమస్కరించారు.

అవధాని తిరిగి నమస్కరించాడు. మధు అవధాని చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకుపోతూ, "నీవు పెట్టిన భిక్ష అన్నయ్యా... నా ఇల్లు చూద్దువుగాని లోపలకు రా..." అన్నాడు. అవధాని మధు చెయ్యి విదిలించి ఈ చింకిబట్టలతోనా... నా కొత్తబట్టలూ, కోటూ ఏవీ... అవి కట్టుకు లోపలకు వస్తాను..." అన్నాడు.

ఆ విదిలింపులోని మాధుర్యం శాంతమ్మ మనసారా అనుభవించింది. అవధాని కొత్తబట్టలు కట్టుకుని, భుజంమీద చెయ్యి వేసుకుని ఇంట్లోకి నడుస్తుంటే శాంతమ్మ సరళను ఎత్తుకుని వెనకాల అనుసరిస్తూ, 'భగవాన్... ఈ సఖ్యం కలకాలం నిలిచేట్లు ఆశీర్వదించు..." అని మనసులో ప్రార్థించింది.

(ఆంధ్రప్రభ, 12 మే,1957)